



ఫేస్‌ టు ఫేస్

పశుసంపద పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

● జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై

రాయచోటిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశుసంపద పరిరక్షణకు చర్యలు తీసుకోవడమే కాకుండా అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై అన్నారు. శుక్రవారం ఆయన పాడిరైతుల, పశుసంపద పరిరక్షణపైన పలు విషయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

ప్రశ్న: జిల్లా వ్యాప్తంగా పశువుల సంఖ్య ఎంత ?
జవాబు: జిల్లా వ్యాప్తంగా 2,76,417 పశువులు, 1.58 లక్షల గేదెలు, 18,24,325 గొర్రెలు, 3,53,370 మేకలు, 30,82,260 కోళ్లు ఉన్నాయి.

ప్రశ్న: పశువుల్లో ఎటువంటి వ్యాధులు వస్తున్నాయి ?
జవాబు: పశువుల్లో సాధారణంగా గాలికుంటు వ్యాధి, ముద్ద చర్మవ్యాధులు వస్తాయి. అలాగే గొర్రెలు, మేకల్లో చిటుకు వ్యాధి, దొమ్మ, నీలినాలుక, మసూచి వ్యాధులు వస్తుంటాయి.

ప్రశ్న: వాటి నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?
జవాబు: వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా 99 టీకాలు ఈ ఏడాది జనవరిలోనే పూర్తి చేశాము. అలాగే గొర్రెల్లో మరణాలు సంభవించకుండా సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లోనే ముందస్తుగా టీకాలు వేశాము. అలాగే పశువుల్లో వచ్చే ముద్ద చర్మవ్యాధికి ఆగస్టులోనే టీకాలు వేశారు.

ప్రశ్న: పశుగ్రాసం కొరత లేకుండా చర్యలు చేపడుతున్నారా ?
జవాబు: వేసవిలో తలెత్తే పశుగ్రాసం కొరతను అధిగమించడానికి జిల్లాకు మంజూరైన 175 టన్నుల అధిక పశుగ్రాస ఉత్పత్తి విత్తనాలను 75 శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేశాము. పండించిన పశుగ్రాసాన్ని ఎండబెట్టి వాములుగా వేసుకుని మార్చి, ఏప్రిల్, మే నెలలో వాడుకుంటే పశుగ్రాసం కొరతను అధిగమించవచ్చు.

ప్రశ్న: సబ్సిడీ కింద పాడి రైతులకు దాణా ఇస్తున్నారా ?
జవాబు: ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో పాడి రైతులకు జిల్లా వ్యాప్తంగా 175 టన్నుల దాణాను 60 శాతం సబ్సిడీతో కేజీ రూ.6.50 పైసలతో పంపిణీ చేశాము. ఈ దాణా పశువులకు వేయడం వలన తక్కువ ఖర్చుతో పాటు పాలఉత్పత్తి పెరుగుతుంది.

ప్రశ్న: జిల్లాలో పాల ఉత్పత్తి ఏ విధంగా ఉంది?
జవాబు: జిల్లా పాడి పశువుల ద్వారా రోజుకు 6 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. ప్రధానంగా రైతుల నుంచి జిల్లాలో హెరిటేజ్, బాలమురుగన్, జెర్సీ శివశక్తి, హాట్‌సన్, సంఘం, తిరుమల, విజన్, విజయ, తేజశ్రీ, ఆరోగ్య తదితర పాలడైరీల వారు పాల సేకరణ చేపడుతున్నారు. 10 రోజులకు ఒకసారి డబ్బులు పాడి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ప్రశ్న: కరువు మండలాల్లో పశువుల సంరక్షణ ఎలా ?
జవాబు: జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మండలాలకు గానూ 19 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. ఆయా కరువు మండలాల్లో వేసవిలో పశుగ్రాసం కొరత లేకుండా చూసేందుకు గడ్డి విత్తనాలు టీఎంఆర్, హెల్త్ క్యాంపులు నిర్వహించేందుకు అవసరమైన ప్రతిపాదనలను తయారు చేసి ప్రభుత్వం దృష్టికి పంపించాము.

సంఘమిత్రల చేతివాటం



● ఎస్‌హెచ్‌జీ సభ్యుల రుణాల్లో గోల్‌మాల్
● ప్రతి రుణానికి 10 శాతం కమీషన్..!
● బంధువుల పేర్లతో బినామీ గ్రూపులు
● బయట అధిక వడ్డీలకు తిప్పుతున్న వైనం

స్వయం సహాయక గ్రూపుల్లోని సంఘమిత్రలు చేతివాటం ప్రదర్శించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యుల రుణాలు, పొదుపు రుణాల్లో భారీ గోల్‌మాల్ చేశారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే చందంగా బంధువుల పేర్లతో బినామీ గ్రూపులు ఏర్పాటు చేసి రూ.లక్షల్లో సొమ్ము కాజేశారు. ఆ డబ్బును బయట అధిక వడ్డీలకు తిప్పుతూ జల్సా చేస్తున్నారు. జిల్లాలో 30 మంది సంఘమిత్రలపై అధికారులు విచారణ చేస్తున్నారంటే ఈ భాగోతం ఏ మేరకు జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇదేకాక గ్రూపుల్లో ఇచ్చే ప్రతి రుణానికి ఒక్కో సభ్యురాలి నుంచి పదిశాతం కమీషన్ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా డీఆర్‌డీఏ అధికారులు వీటిపై విచారణకు కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు సభ్యులు కోరుతున్నారు.



మదనపల్లెటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళ సభ్యులకు దిశానిర్దేశం చేయడంతో పాటు వారిని సక్రమమైన మార్గంలో నడిపేందుకు డీఆర్‌డీఏ అధికారులు సంఘమిత్రలను నియమించారు. కానీ కొందరు సంఘమిత్రలు స్వార్థ ప్రయోజనాలతో బినామీ సభ్యుల పేర్లతో రుణాలు స్వాహా చేస్తున్నారు. తక్కువ వడ్డీలతో ఎస్‌హెచ్‌జీ రుణాలు తీసుకుని బయట ఎక్కువ వడ్డీలకు తిప్పుతున్నారు. కొందరైతే గ్రూపు సభ్యులకు మంజూరయ్యే రుణాల్లో 10శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారు. మరికొందరు అసలు గ్రూపు సభ్యుల స్థానంలో తమ బంధువులను బినామీలుగా చేర్చి అందినకాడికి దోచుకుంటున్నారు.

10 శాతం కమీషన్ ఇస్తేనే రుణాలు

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌హెచ్‌జీ గ్రూపులను ఏర్పాటు చేసి వాటికి తక్కువ వడ్డీలతో రుణాలు, అతి తక్కువ వడ్డీలతో ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు రుణాలు మంజూరు చేస్తున్నాయి. వీటితో పాటు, ఉన్నతి, శ్రీనిధి, లక్‌పత్ దీదీ తదితర పథకాలను ప్రవేశపెట్టి మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఎస్‌హెచ్‌జీ సంఘాలను దిశానిర్దేశం చేయడంతో పాటు, వారితో వీవో (గ్రామసభ)లు ఏర్పాటు చేసి అందరినీ ఒక్కటిగా నడిపేందుకు సంఘమిత్రలను నియమించారు. కానీ గ్రామాల్లో చదువుకోని మహిళలను కొందరు సంఘమిత్రలు మాయ మాటలు చెప్పి బురిడీ కొట్టిస్తున్నారు. మహిళా సంఘాలకు మంజూరయ్యే శ్రీనిధి, ఉన్నతి, సామాజిక పెట్టుబడి నిధి(సీఐఎఫ్), పొదుపు రుణాలతో పాటు ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు మంజూరయ్యే రుణాలకు గ్రూపు సభ్యుల నుంచి ముక్కుపిండి 10 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. అదేమని ప్రశ్నించే వారిని నిబంధనల పేరిట గ్రూపుల్లో నుంచి తొలగిస్తున్నారు.

బంధువుల పేర్లతో బినామీ గ్రూపులు

అన్నమయ్య జిల్లా డీఆర్‌డీఏ పరిధిలో 30,065 స్వయం సహాయక మహిళా గ్రూపులు(ఎస్‌హెచ్‌జీ) వున్నాయి. వీటిని 1,047 మంది సంఘమిత్రలు మానిటరింగ్ చేస్తున్నారు. వాస్తవంగా ఒక ఎస్‌హెచ్‌జీలో 8 నుంచి 12 మంది వరకు మహిళా సభ్యులు వుంటారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసే గ్రూపులకు ఫస్ట్ లీడర్, సెకండ్ లీడర్ ఆధ్వర్యంలో గ్రూపు సభ్యులకు రుణాలు ఇతర సంక్షేమ పథకాలు అందిస్తుంటారు. ఇలాంటి ఎస్‌హెచ్‌జీలను 30 చొప్పున ఒక్కటిగా చేసి వాటిని మానిటరింగ్ చేసేందుకు ఒక సంఘమిత్రను ఏర్పాటు చేశారు. వీరికి నెలకు రూ.8వేలు వేతనం, గ్రామ సమాఖ్య పుస్తకాలు రాసేందుకు రూ.2వేలు ఇస్తారు. పేదరికంలో వున్న మహిళలను లక్షాధికారులు చేయడం, గ్రూపు సభ్యులకు పొదుపు గురించి నేర్పించడం, ఆరోగ్యంగా వుండేలా చేయడం, సంఘాలు బలోపేతం చేయడం, సూక్ష్మ రుణాల గురించి అవగాహన కల్పించడం తదితర విధులు నిర్వహించాలి. కాగా సంఘాలను బలోపేతం చేసే పనిలో పనిగా కొందరు సంఘమిత్రలు తమకు కావాల్సిన మహిళల పేర్లను గ్రూపుల్లోకి ఎక్కిస్తారు. చదువుకోని వారిని, అమాయకులను, బంధువులను వారికి నచ్చిన గ్రూపుల్లోకి ఎక్కిస్తారు. ఇక్కడ ఫస్ట్ లీడర్, సెకండ్ లీడర్లను మెయింటైన్ చేసుకుని, గ్రూపు సభ్యులకు వచ్చే రుణాలను వారి ఖాతాల్లో వేయించుకుంటారు. ఇలా తక్కువ వడ్డీలతో వచ్చే రుణాల సొమ్మును గ్రామాల్లో ఎక్కువ వడ్డీ (నెలకు రూ.3 నుంచి రూ.5 వరకు) అప్పులిస్తున్నారు. అంతేకాకుండా ఎవరైనా పేద మహిళలు గ్రూపులో రుణం తీసుకుని కట్టలేకుంటే, వారి రుణాన్ని సంఘమిత్రలే కట్టి వేస్తారు. కాగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుణం బాకీని తాము చెల్లించామని, చెబుతూ గ్రూపు సభ్యుల నుంచి రూ.3 నుంచి రూ.5 చొప్పున అసలు సొమ్ముకు వడ్డీలు వసూలు చేస్తున్నారు.

పొదుపు రుణాలనూ వదలని వైనం

స్వయం సహాయక గ్రూపు సభ్యులు పొదుపు కింద కొంత సొమ్మును ప్రతి నెలా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఏడాదికి ఒకసారి పొదుపు సొమ్ములో వున్న డబ్బును గ్రూపులో ఒకరికి నామమాత్రం వడ్డీలకు ఇస్తారు. ఇలాంటి పొదుపు సొమ్ములను కూడా కొందరు సంఘమిత్రలు స్వాహా చేస్తున్నారు. కొందరైతే మినిట్స్ పుస్తకాల్లో లెక్కా, పక్కా రాయకుండా, రాసినా వాటిని గ్రూపు లీడర్లకు చూపించకుండా మాయం చేస్తున్నారు. గ్రూపు సభ్యులు కట్టే రుణాల సొమ్ములను కొందరు సంఘమిత్రలు బ్యాంకుల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకుంటున్నారు. చాలా వరకు గ్రామాల్లో వీరిని ప్రశ్నించే వారు లేకపోవడంతో సంఘమిత్రలు మహిళలను లక్షాధికారులు చేయడం అటుంచి వారే కోటీశ్వరులయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు.

జిల్లాలో 30 సంఘమిత్రలపై విచారణ

జిల్లాలో 1,047 మంది సంఘమిత్రలు వుండగా వైసీపీ హయాంలో పనిచేసిన కొందరు సంఘమిత్రలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొంతమంది తమ భాగోతం బయటపడుతుందని స్వచ్ఛందంగా తప్పుకోగా, కొందరు స్వాహా సొమ్ములు చెల్లించలేక గుట్టుచప్పుడు కాకుండా వుండిపోయారు. జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 30 మంది సంఘమిత్రలపై వచ్చిన ఫిర్యాదులను డీఆర్‌డీఏ అధికారులు విచారణ చేస్తున్నారు. ఉదాహరణకు మదనపల్లె మండలం పోతబోలు హరిజనవాడలోని సంఘమిత్ర, చీకిలబైలు రుణాల సొమ్ము స్వాహా చేసినట్లు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో డీఆర్‌డీఏ అధికారులు పోతబోలు సంఘమిత్ర స్వాహా చేసిన సొమ్ము విషయమై పది రోజుల పాటు విచారించి, నాలుగేళ్ల లెక్కలను సరిచూసి రూ.13.76 లక్షలు దుర్వినియోగం చేసినట్లు తేల్చి చెప్పారు. అంతేకాకుండా ఆమెను సంఘమిత్ర విధుల్లో నుంచి తప్పించారు. గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించి సంఘమిత్ర దుర్వినియోగం చేసిన రూ.13.76 లక్షలను తిరిగి చెల్లించాలని గడువు ఇచ్చారు. అలా లేని పక్షంలో క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేశారు. ఇలాంటి ఘటనలే బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పీటీఎం మండలాల్లో కూడా చోటు చేసుకున్నాయి. సంఘమిత్రలను పర్యవేక్షించేందుకు నియమించిన కమ్యూనిటీ కోఆర్డినేటర్లు (సీసీలు), ఏపీఎంలు కొందరు నింపాదిగా విధులు నిర్వహించడంతోనే గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ రుణాలను సంఘమిత్రలు పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఏపీఎంలు, సీసీలు సక్రమంగా పనిచేస్తున్నా, సంఘమిత్రల చేతివాటం గుర్తించడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సదుద్దేశ్యంతో ఎస్‌హెచ్‌జీలకు ఇచ్చే రుణాలు పక్కదోవ పట్టకుండా డీఆర్‌డీఏ అధికారులు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాల్సి వుంది.


పోతబోలు సంఘమిత్ర అక్రమాలపై విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ అధికారులు (ఫైల్‌ఫోటో)

పూర్తిస్థాయి ఎంక్వైరీ చేసి తొలగిస్తున్నాం..

కొన్ని గ్రామాల్లో సంఘమిత్రలపై వచ్చే ఫిర్యాదులను పూర్తిస్థాయిలో ఎంక్వైరీ చేసి విధుల నుంచి తొలగిస్తున్నాం. రుణాల సొమ్ము దుర్వినియోగం చేసిన సంఘమిత్రల నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తున్నాం. అలా చెల్లించని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇలాంటి వారి గుట్టు విప్పేందుకు సంఘాల సభ్యులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. అందుకే మహిళలు చదువుకుంటే ఇలాంటి అక్రమాలను ఎండగట్టే అవకాశం వుంది.

\- సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, రాయచోటి

వేడుకగా కార్తీక పౌర్ణమి శోభ

● రాయచోటి వీరభద్రాలయంలో కోటి దీపోత్సవం ● పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాయచోటిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని జిల్లాలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాల్లో దీపాలు వెలిగించి స్వామివారిని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా రాయచోటి పట్టణంలోని వీరభద్రాలయంలో కోటిదీపోత్సవం, గుగ్గిలం పూజ నిర్వహించగా, ప్రాచీన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు దక్షిణమూర్తి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మదనపల్లెలోని యోగభోగేశ్వరుడికి అర్చకులు అన్నాభిషేకం చేశారు. కలికిరి సోమేశ్వరస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు దీపాలు పెట్టారు. ఇక రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో భక్తులు విశేషంగా పూజలు చేశారు.


అన్నాభిషేకంలో మదనపల్లె యోగభోగేశ్వరుడు


కలికిరి సోమేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

రాయచోటి వీరభద్రస్వామి ఆలయంలో గుగ్గిలం పూజలో పాల్గొన్న భక్తులు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్


జిల్లాలో ఇసుక కొరత లేదు

● స్థానిక అవసరాలకు ఉచితంగా తీసుకెళ్తున్నారు
● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుకకు కొరత లేదని, స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్తున్నారని కలెక్టర్ చామకూరి శ్రీధర్, మైనింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్‌కుమార్‌మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఇసుక అంశంపై మైనింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న ఇసుక రీచ్‌లు ఎన్ని, పనిచేస్తున్నవి ఎన్ని, ఇంకనూ ప్రారంభించాల్సినవి ఎన్ని, రీచ్‌లో అవసరమైన మేర ఇసుక అందుబాటులో ఉందా, ఇసుక సరఫరా కొరకు ఏజెన్సీల ఎంపిక, ప్రస్తుత ఇసుక రేట్లు, బల్క్ రిజిస్ట్రేషన్, సరఫరా, అంతరాష్ట్ర చెక్‌పోస్టుల్లో నిఘా తదితర అంశాల్లో జిల్లాల వారీగా మైనింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కలెక్టర్లతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెండర్లు ఫైనలైజ్ చేయని చోట్ల వెంటనే టెండర్లను పిలిచి ఒక వారంలోగా ఏజెన్సీలను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు ఇసుకను అందిస్తోందని, సరిహద్దు చెక్‌పోస్టుల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఐదు ఇసుక రీచ్‌లు ఉన్నాయని తెలిపారు. ఇందులో మూడు ఇసుక రీచ్‌లు పనిచేస్తున్నాయని, అందులో అవసరమైన మేర ఇసుక లభ్యత అందుబాటులో ఉందన్నారు. అలాగే ఒకే మండలంలో వీరబల్లి, మట్లిల్లో త్వరగా ఇసుక రీచ్‌లు ప్రారంభిస్తామన్నారు. స్థానికంగా చిన్న చిన్న సమస్యలతో రీచ్‌లు ప్రారంభం కాలేదని, స్థానికులతో మాట్లాడి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, మైనింగ్ శాఖ ఏడీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముని కల్యాణం

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండరామాలయంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపం వద్ద ఉంచి కల్యాణతంతును ప్రారంభించారు. పుణ్యాహవచనం, యజ్ఞోపవితరణ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించి అనంతరం వైష్ణవ సంప్రదాయంలో వేదపండితుల మధ్య సీతమ్మ తల్లికి శ్రీరామచంద్రుడు మాంగళ్యధారణ చేసే తంతు జరిపించారు. అనంతరం తలంబ్రాల సమర్పణ, పూలచెండ్ల మార్పిడి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ నగేష్, అర్చకులు పవన్‌కుమార్, శ్రావణ్‌కుమార్, సిబ్బందినాయక్, రామ నరసింహులు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.


మాంగళ్య ధారణ కార్యక్రమ దృశ్యం

ఏఎస్పీ (అడ్మిన్)గా వెంకటాద్రి బాధ్యతలు

రాయచోటిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా వెంకటాద్రి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్ నుంచి బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లాకు వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు సిబ్బందికి సంబంధించిన పెండింగ్ ఫైళ్లను వేగంగా పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతలు మెరుగుపరిచే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందించారు. ముఖ్యంగా క్రమశిక్షణ, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించడం, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. వెంకటాద్రి 19991వ సంవత్సరంలో ఎస్‌ఐగా ఎంపికై ఉమ్మడి కడప జిల్లాలో ఎస్‌ఐ, సీఐగా, 2013వ సంవత్సరంలో పదోన్నతి పొంది కర్నూ లు ఎన్‌ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ)లో డీఎస్పీగా, తిరుపతి ఎస్వీ మహిళా కళాశాల పరిధిలో ఏసీబీ డీఎస్పీగా, రేణిగుంట డీఎస్పీగా పనిచేశారు. 2024 సంవత్సరంలో అదనపు ఎస్పీగా పదోన్నతి పొందారు. శాంతి భద్రతల పరిరక్షణకు ఇటలీ దేశంలో శిక్షణ పొందారు. ఎన్‌ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ)లో డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో హైదరాబాదులో దిల్‌సుఖ్‌నగర్ సైకిల్‌బాంబు, గోకుల్‌చాట్, నెక్లెస్ రోడ్డు, టెర్రరిస్టుల విధ్వంసంలో ప్రాణనష్టం సంఘటనలో ప్రాణాలను లెక్కచేయకుండా ఐదుగురి టెర్రరిస్టులకు ఉరిశిక్ష వేయించారు. ఈయన సేవలను గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు ఇండియన్ పోలీసు మెడల్, ఏపీ పోలీసు సేవా పతకంతో పాటుగా మొత్తం తన సర్వీసులో 200 పైబడి రివార్డులు అందుకున్నారు. కాగా బాధ్యతలు చేపట్టిన వెంకటాద్రిని పలువురు పోలీసు అధికా రులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


ఎస్పీకి పూల మొక్కను అందజేస్తున్న ఏఎస్పీ వెంకటాద్రి

నేడు పెద్దదర్గా గంధం మహోత్సవం



కడప కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడపలోని ప్రఖ్యాత పెద్ద దర్గా (అమీన్‌పీర్‌దర్గా) ఉరుసు ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి 9 గంటలకు పీఠాధిపతి స్వగృహం నుంచి గంధకలశం తీసుకుని మేళతాళాలతో, ఫకీర్లతో, దేశప్రముఖుల పీఠాధిపతులు, పురప్రముఖులు, శిష్యకోటి బృందంతో దర్గా చేరుకుని మజార్ వద్ద గంధం సమర్పించి ఫాతెహా ఇవ్వనున్నారు. రాత్రి ఖవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అధిక లాభాల అరటి

● కూలీలు, మందుల పిచికారి ఖర్చులు చాలా తక్కువ
● ఒకసారి సాగు చేస్తే మూడుసార్లు దిగుబడి

6



కుక్కల దాడిలో కృష్ణజింకకు తీవ్రగాయాలు



ములకలచెరువు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో ఓ కృష్ణజింక తీవ్రంగా గాయపడ్డ సంఘటన శుక్రవారం ములకల చెరువు సమీపంలో చోటు చేసుకుంది. కుక్కల బారిన పడ్డ కృష్ణజింకను కూలీలు రక్షించారు. ములకలచెరువులోని పీటీఎం రోడ్డులో ఉన్న టీటీడీ కళ్యాణ మండపం సమీపంలోని పంట పొలాల వద్దకు వచ్చిన కృష్ణ జింకపై కుక్కల గుంపు దాడి చేసింది. ఈ సమయంలో బొలెరో వాహనంలో అటుగా వచ్చిన టమోటా మండీ కూలీలు కుక్కల బారి నుంచి కృష్ణజింకను రక్షించారు. గాయపడ్డ జింకను వాహనంలో పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. దీంతో పోలీసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. గాయపడ్డ కృష్ణజింకకు అటవీశాఖ అధికారులు స్థానిక పశువైద్యశాలలో చికిత్సలు అందించి కనుగొండ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్‌ఫొటో)

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో కొత్తమాధవరానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం పుత్తా శ్రీనివాసులు (56) తన భార్యతో కలసి స్థానిక మృకుండ మల్లేశ్వరాల యానికి వెళ్లాడు. పూజల అనంతరం తిరిగి వచ్చే క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా కడప నుంచి తిరుపతి వైపు వెళుతున్న రైలు దూసుకువచ్చింది. దీంతో పట్టాల అవతల ఉన్న వారిని రావద్దని చేతితో సైగలు చేస్తుండగా రైలు బలంగా ఢీకొంది. దీంతో చేయి విరిగి దూరంగా పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య ప్రమాదం నుంచి తప్పించుకుంది. వీరి కూతురు ప్రస్తుతం బీటెక్ చదువుతుండగా, కుమారుడికి మతి స్థిమితం లేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

టమోటా మార్కెట్‌లో కూలీ మృతి

కురబలకోట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు టమోటా మార్కెట్‌లో చాంద్‌బాష(45) అనే కూలీ మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం ఇందిరానగర్‌కు చెందిన చాంద్‌బాష హమాలీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కూలి పనుల నిమితం అంగళ్లు టమోటా మార్కెట్‌కు వచ్చి రాత్రి 8 గంటల సమయంలో లారీకి టమోటా క్రేట్‌లను లోడ్ చేస్తుండగా నేలపై పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు కుటుంబీకులకు తెలిపారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




కోటిరెడ్డిగారిపల్లె సమీపంలో సాగులో ఉన్న అరటి తోట

జిల్లాలోని తూర్పు ప్రాంతమైన రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో అరటి సాగు ఎక్కువ. ఇక్కడ బొప్పాయి, మామిడి తోటలు ఉన్నప్పటికీ అరటికి పెట్టింది పేరు. అలాంటిది ఇటీవల పడమటి మండలాల్లోనూ అరటిసాగు పెరుగుతోంది. అయితే ఇక్కడ ఎక్కువ ఆదాయాన్నిచ్చే యాలక్కి రకం అరటిని సాగుచేస్తున్నారు. ఒకసారి సాగు చేస్తే మూడు పర్యాయాలు దిగుబడి వస్తోంది. కూలీల, మందుల పిచికారి ఖర్చులు కూడా చాలా తక్కువ. పెట్టుబడి కంటే ఆదాయం రెట్టింపు వస్తుండటంతో రైతన్నలు అరటి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

అధిక లాభాల అరటి

- కూలీలు, మందుల పిచికారి ఖర్చులు చాలా తక్కువ
- ఒకసారి సాగు చేస్తే మూడుసార్లు దిగుబడి
- పడమటి మండలాల్లో పెరుగుతున్న సాగు

ములకలచెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గం పంటల సాగు ప్రయోగాలకు నిలయంగా నిలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో విదేశీ పంట డ్రాగన్, అరబ్ దేశాల్లో పండే ఖర్జూరం సాగు చేసి రైతులు మంచి ఫలితాలు సాధించారు. అలాగే అనంతపురం జిల్లాలో అత్యధికంగా తమలపాకులు కూడా సాగు చేస్తున్నారు. తాజాగా రైతన్నలు అరటి సాగుపై దృష్టి సారించి మంచి దిగుబడులు సాధిస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు. అరటి సాగుకు నీరు కూడా తక్కువగా అవసరమతుంది. మందుల పిచికారి ఒక్కసారి మాత్రమే చేస్తున్నారు. కూలీల అవసరం అతి తక్కువ. పంట సాగు చేసిన మొదటి ఏడాది మాత్రం ఖర్చు కొంచెం ఎక్కువగా ఉంటుంది. తర్వాత రెండేళ్ల ఖర్చు చాలా తక్కువ. ఈ కారణంగా అరటి పంట సాగుపై అన్నదాతలు మక్కువ చూపుతున్నారు. పంట తొలిసారి సాగు చేసినప్పుడు రూ.70వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు వస్తోంది. తరువాత ఏడాది ఖర్చు రూ.40వేల వరకు తగ్గుతుంది. మూడవ ఏడాది ఖర్చు మరింత తగ్గుతుంది. ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో అరటి సాగు ప్రయోగాత్మకంగా సాగు చేసి మంచి ఫలితాలు సాధించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా అరటి సాగులో ఉంది. దాదాపు 80 ఎకరాల్లో ఇక్కడ అరటి సాగులో ఉంది. వీటిలోనూ ఎక్కువమంది యాలక్కి రకం సాగు చేస్తున్నారు. ఇవి షుగర్ జబ్బు ఉన్న వారు కూడా తినొచ్చు. దీంతో వీటికి ధర ఎక్కువ. ఇవి సాధారణంగా కర్ణాట కలో ఎక్కువగా సాగు చేస్తారు. ఇప్పుడు తంబళ్లపల్లె నియోజకవర్గం లోనూ సాగు చేస్తుండటం విశేషం.



పర్తికోట సమీపంలో యాలక్కి రకం అరటి గెలలు

నీటి వినియోగం తక్కువ

మిగిలిన పంటలతో పోలిస్తే అరటి పంట సాగుకు నీటి వినియోగం చాలా తక్కువ. డ్రిప్ ఇరిగేషన్ కింద పంట సాగు చేస్తున్నారు. అరటి పంటకు వేసవిలో రెండు లేదా మూడు రోజులకు ఒకసారి నీరు వదలాల్సి ఉంటుంది. తరువాత ఐదు రోజులకు ఒకసారి నీరు అందించినా పరవాలేదు. కర్ణాటక రాష్ట్రం నుంచి మొక్కలు తెచ్చి నాటుతున్నారు. ఎకరాకు 1200 మొక్కలు నాటాల్సి ఉంటుంది. సాగు చేసిన 10 నుంచి 11 నెలలకు మొదటిసారి దిగుబడి వస్తోంది. తరువాత ఏడాది ఏడు నెలలకే దిగుబడి వస్తుంది. మూడోసారి ఆరు నెలలకే దిగుబడి వస్తుంది. ఆశించిన స్థాయిలో ధరలు ఉంటే మాత్రం రైతు పంట పండినట్లే. ములకలచెరువు మండలం దుగుసానివారి పల్లెకు చెందిన రైతు యాలక్కి రకం అరటి ఐదు ఎకరాలలో సాగు చేశారు. వీటిని బెంగళూరులోని దన్నేపేట బనానా మార్కెట్‌కు తరలించి విక్రయించారు. అన్ని ఖర్చులు పోను ఎకరాకు రూ.4లక్షల ఆదాయం వచ్చిందని రైతు తెలిపారు. ములకలచెరువు మండలం కోటిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు కర్ణాటక రాష్ట్రం నుంచి జీ-6 రకం మొక్కలు తెచ్చి ఐదెకరాలలో అరటి సాగు చేశారు. మొదటి కాపులో రూ.10లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఇలా ఒకరిని చూసి ఒకరు పడమటి మండలాల్లోనూ అరటి సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, పులివెందుల నియోజకవర్గాల్లో మాత్రమే అరటి పెద్ద ఎత్తున సాగయ్యేది. ఇప్పుడు మెల్లగా పడమటి ప్రాంతానికీ విస్తరిస్తోంది. ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ కావడంతో రైతులు దీనిపై మక్కువ చూపుతున్నారు.



పర్తికోట నుంచి బెంగళూరు మార్కెట్‌కు తరలిస్తున్న అరటిగెలలు

ఖర్చు చాలా తక్కువ



అరటి తోట సాగుకు ఖర్చు చాలా తక్కువ. ఒకసారి పంట సాగు చేస్తే మూడుసార్లు దిగుబడి వస్తుంది. ఐదు ఎకరాల్లో యాలక్కి రకం సాగు చేసి రూ.5లక్షలు ఖర్చు చేశా. మొదటి ఏడాదే రూ.20లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఇప్పుడు రెండవ ఏడాది దిగుబడి వస్తుంది. ఎక్కువ గాలులు వీస్తే తోటకు ఇబ్బంది. అరటి సాగు మంచి ఫలితాలు ఇస్తోంది.

- మనోహర్‌రెడ్డి, దుగుసానివారిపల్లె, ములకలచెరువు మండలం

మందులు పిచికారి ఒక్కసారే



ఐదు ఎకరాల తోటకు ఒక్క సారి మాత్రమే మందులు పిచికారి చేశాము. తరువాత ఎలాంటి మందులు వాడలేదు. మంచి దిగుబడి వచ్చింది. వ్యాపారులే తోట వద్దకు వచ్చి అరటి కాయలు కొనుగోలు చేసి కొనుకెళ్లారు. మొదటిసారి రూ.10లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఇక గెల 33-35 కిలోలు ఉంది. కష్టం కూడా తక్కువే.

- రమణారెడ్డి, కోటిరెడ్డిగారిపల్లె, ములకలచెరువు మండలం

రైతులకు తగిన న్యాయం చేస్తాం

- రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్

గుర్రంకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అక్ర మాలకు గురైన రైతుల పొలాలను రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి రైతులకు న్యాయం చేస్తామని రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీని వాస్ అన్నారు. ప్యారంపల్లె గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ భూములను ఓ వ్యక్తి దౌర్జన్యంగా అక్రమించుకొని ఇబ్బందులు పెడు తున్నారంటూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీనివాస్ రైతుల భూములు ఆక్రమించి ఫెన్సింగ్ వేసిన వ్యక్తి భూములను రైతులతో కలిసి పరిశీలించారు.

గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిగ రెవెన్యూ గ్రామంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రైతుల నుంచి భూములు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో ప్యారంపల్లె గ్రామానికి చెందిన కొందరి రైతుల పొలాలు వ్యాపారి కొన్న భూముల మధ్యలో ఉన్నాయి. దీంతో వ్యాపారి తన భూమి చుట్టూ రాతికూసాలు నాటి ఫెన్సింగ్ వేశాడు. ఈ క్రమంలో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లడానికి వీలులేకుండా పోయింది. అంతేకాకుండా కొందరు రైతుల పొలాలను దౌర్జన్యంగా లాక్కొని అక్రమాలకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన రైతులు డిప్యూటీ సీఎంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీనివాస్‌లు ముందుగా ప్యారంపల్లె రైతులతో మాట్లాడారు. అనంతరం అక్రమాలకు గురైన రైతుల పొలాలను పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందిని అడిగి రికార్డులను పరిశీలించి, వివరాలను సేకరించారు. భూముల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. అక్రమాలకు గురైన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్యారంపల్లె రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

రాత్రికి రాత్రే పంచాయతీ స్థలం ఆక్రమణ

వాల్మీకిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీ స్థలంలో రాత్రికి రాత్రే ఆక్రమణదారులు పాగా వేశారు. ఎవరి అనుమతి లేకుండా ఓ బంకును ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట ఇటీవల రెండు రోజుల క్రితం పంచాయతీ అధికారులు దుర్గంధంగా ఉన్న స్థలాలను శుభ్రం చేశారు. అయితే ఈ స్థలాల్లో గురువారం రాత్రికి రాత్రి ఓ బంకును ఏర్పాటు చేసి వ్యాపారాలకు తెరలేపారు. గురువారం ఉదయం నుంచి ఆ ప్రాంతంలో రహస్యంగా ఏర్పాటు చేసిన ఆ బంకు ఎవరన్నది అధికారులకు సైతం వివరాలు తెలియరాక పోవడం గమనార్హం. గ్రామ పంచాయతీ స్థలాల్లో, అందులోనూ అధికారుల అనుమతులు లేకుండా బంకును ఏర్పాటు చేశారంటూ సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై స్థానిక పంచాయతీ ఈవో రవీంద్రనాథ్‌ను వివరణ కోరగా ఆ ప్రాంతంలో బంకు ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, పరిశీలించి తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పంచాయతీ స్థలాలలో అక్రమణలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి రోడ్డులో రాత్రికి రాత్రి వెలసిన బంకు

వయోవృద్ధుల గుర్తింపు కార్డులపై స్పష్టత

కలికిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వయోవృద్ధులకు రాయితీ టికెట్ల కోసం చూపించే గుర్తింపు కార్డుల విషయంపై ఆర్టీసీ అధికారులు స్పష్టత ఇచ్చారు. ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే 60 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు టికెట్టు ధరపై 25 శాతం రాయితీ వున్న విషయం తెలిసిందే. అయితే వయసు నిర్ధారణ కోసం వీరు చూపించే గుర్తింపు కార్డుల విషయంలో అనేక రకాల పేచీలు రావడం పరిపాటిగా మారింది. ఇది పలు వివాదాలకు కూడా దారితీసింది. దీన్ని గుర్తించి ఆర్టీసీ యాజమాన్యం గుర్తింపు కార్డుల గురించి పూర్తి స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (ఆపరేషన్స్) ఈ మేరకు కింది స్థాయి అధికారులు, ఉద్యోగులకు పలు సూచనలు జారీ చేశారు. పలువురు వయోవృద్ధులకు ఇతర రాష్ట్రాల్లో ఆధార్‌కార్డు నమోదైన కారణంగా రాయితీ టిక్కెట్లతో ప్రయాణానికి అంగీకరించడం లేదని ఈడీ వెల్లడించారు. కేవలం ఆధార్ కార్డు కోసమే ఒత్తిడి చేయడం కూడా భావ్యం కాదన్నారు. ఇక నుంచి ఆధార్ కార్డు సహా సీనియర్ సిటిజన్ ఐడీ కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, రేషన్ కార్డుల్లో దేన్ని చూపించినా అంగకరించాలని ఈడీ స్పష్టం చేశారు. అది ఏ రాష్ట్రంలో జారీ అయినా సమ్మతించాలన్నారు. స్థానికతతో సంబంధం లేకుండా అన్నిరకాల ఐడీ కార్డులను ఆమో దించాలని కూడా ఆయన స్పష్టం చేశారు. కేవలం 60 ఏళ్లు పైబడి వుండాలన్న నిబంధనను మాత్రం పాటించాలని చెప్పారు. ఐడీ కార్డుల్లో కేవలం కార్డును మాత్రమే తప్పనిసరిగా చూపించాల్సిన అవసరం కూడా లేదని, డిజిటల్ రూపంలో వున్నా అంగీకరించాల్సిందేనని స్పష్టంగా పేర్కొన్నారు.

వయసు నిర్ధారణ కోసం మాత్రమే ఐడీ కార్డును చూపించాలన్న నిబంధనను గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. అవగాహన లేని కారణంగా వయోవృద్ధుల్లో ఆర్టీసీపైన అసహనం పెరుగుతోందని, దీనికి సంబంధించిన ఫిర్యాదులు కూడా ఎక్కువగా వస్తున్నాయని గుర్తు చేశారు. ఇక మీదట అలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఈడీ సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అనితదీప్తి



రైల్వేకోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకురాలు దుద్యాల అనితదీప్తి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమె కడప మెప్మాలో కో-ఆర్డినేటర్‌గా పనిచేసేవారు. 2021లో తన పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. గత ఎన్నికల్లో రైల్వేకోడూరు టికెట్టు కోసం చివరి వరకు పోరాడినా దక్కలేదు. ఆమె సేవలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఈ పదవి ఇచ్చినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

సుండుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగముని నాయక్‌కు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుతున్న చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదు అందడంతో విచారణ చేసి నివేదికను అందజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

నీకేదిన్నె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దివారి అతుల్‌కుమార్ (42) మృతిచెందినట్లు నీకేదిన్నె పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు... చిత్తూరు నుంచి కడపకు బ్యాటరీ లోడుతో వచ్చిన లారీ గురువారం తెల్లవారుజామున గువ్వల చెరువు ఘాట్ దిగుతూ అదుపుతప్పి ఓ వైపునకు పడిపోయింది. దీంతో డ్రైవర్ అతుల్ ఆచూకీ తెలియరాలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం లారీలోని సరుకు తొలగించి లారీని క్రేన్‌తో ఎత్తి చూడగా లారీ కింద ఇరుక్కుపోయిన ఆయన మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె



తహసీల్దారుకు నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

పీలేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీలోపు తమ సమస్యలు పరిష్కరించ కుంటే నిరవధిక సమ్మెలోకి వెళతామని 108 ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని, గత నాలుగేళ్ల కాలంలో తమకు వేతన సవరణ జరగలేదని, ప్రతి ఏడాదీ ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు, అరియర్స్, ఈఎల్ డబ్బులను అరబిందో సంస్థ చెల్లించలేదని తెలిపారు. ఉద్యోగులకు చెందిన పీఎఫ్‌లో యాజమాన్య వాటా కూడా ఉద్యోగుల దగ్గరే వసూలు చేస్తున్నారని వారు వాపోయారు. 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వంలో తమకు ప్రతి నెలా రూ.4 వేలు అదనంగా ఇచ్చేవారని, దానిని గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, దానిని వెంటనే పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం చేస్తున్న 12 గంటల పని విధానాన్ని రద్దు చేసి 8 గంటల పని విధానం అమలు చేయాలని, అంతర జిల్లాల బదిలీలు చేపట్టాలని, ఇది వరకే మరణించిన ఉద్యోగులకు రూ.20 లక్షల బీమా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై తాము ఇది వరకే అటు ప్రభుత్వానికి, ఇటు అరబిందో సంస్థకు విన్నవించుకున్నామని, ఈ నెల 25వ తేదీలోపు పరిష్కారం కాకుండా సమ్మెలోకి దిగడం తప్ప తమకు గత్యంతరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగులు రహంతుల్లా, వెంకటాచలపతి, శ్రీనివాసులు, రవి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తట్టుకోలేక నా కుమార్తె వెళ్లిపోయింది

- పోలీసులకు తండ్రి ఫిర్యాదు

పులివెందులటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తట్టుకోలేక తన కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిందని అర్బన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం జొన్నా లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. పులివెందుల పట్టణం ఆర్టీసీ డ్రైవర్ జయరాం కుమారుడు విష్ణువర్ధన్ 2014లో జొన్నా టెక్స్‌టైల్స్ షోరూం యజమాని కుమార్తె హేమలతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వికలాంగుడిగా పుట్టడంతో భార్యను భర్త విష్ణువర్ధన్ మానసికంగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి హేమలత ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

వీరబల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పనులు చేయకుండానే పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ సానిపాయి పంచాయతీ సర్పంచ్ నేతి అంజనేయులుపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఆయన ఆదేశాల మేరకు డీఎల్‌పీవో మస్తాన్‌వలీ శుక్రవారం గ్రామ సచివాలయంలో విచారణ నిర్వహించారు. గ్రావెల్ పనులు చేయకుండానే రూ.20 లక్షల వరకు డ్రా చేసినట్లు ఫిర్యాదుదారులు రాంమోహన్, రమేశ్ ఆరోపించారు. బ్లీచింగ్ చల్లకుండా, నీళ్ల ట్యాంకు శుభ్రం చేయకుండానే నిధులు డ్రా చేవారన్నారు. పనులకు సంబంధించి రికార్డులు చూపించాలని డీఎల్‌పీవోను అడిగారు. సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు కింద ఉంచడంపై అసహనం వ్యక్తం చేశారు. సర్పంచ్ నేతి అంజనేయులు మాట్లాడుతూ తాను చేసిన పనులకు రికార్డులున్నాయని, తమపై కక్ష గట్టి ఇలా విచారణలు చేయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో మస్తాన్‌వలి

ఉచితానికి ఈకేవైసీ కష్టాలు



- నమోదు అయితేనే లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు
- గ్రామీణప్రాంతాల్లో అవగాహన లేమి
- పలువురు పేదలకు చేకూరని లబ్ధి

పులివెందుల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉచిత సిలిండరు పథకానికి ఈకేవైసీ ప్రభుత్వం తప్పనిసరి చేయడంతో లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం నుంచి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు పొందాలంటే తమ గ్యాస్ ఏజన్సీల ద్వారా ఆధార్‌తో లింకు చేయించుకోవాలని చెబుతున్నారు. సరైన అవగాహన లేక చాలామంది లబ్ధిదారులు పథకానికి దూరంగా ఉన్నారు. మరోవైపు డెలివరీ బాయ్‌లు సిలిండరు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా ఆ లబ్ధిదారుడు ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పినా పట్టించుకోని పరిస్థితి. ప్రభుత్వం దీపావళి సందర్భంగా గత నెల 29 నుంచి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది.

పులివెందుల డివిజనులో 48229 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో దీపం పథకం కింద 33169, ఉజ్వల్ కింద 15060 గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. 26350 మంది లబ్ధిదారులు మాత్ర మే ఈకేవైసీ చేయించుకున్నారు. 21879 మంది చేయించుకోలేదు. అయితే ప్రభుత్వం ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రారంభించడంతో ఈ వారంలో మరో ఐదువేల మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 16879 మంది స్పందించలేదు. ఈకేవైసీ చేయించుకుంటేనే ఈ ఉచిత సిలిండర్లు వస్తాయి. మరోవైపు గ్యాస్‌కనెక్షన్లు పొందే సమయంలోనే ఆధార్ అనుసంధానం చేయించుకోవాల్సి ఉంది. గతంలో రేషన్‌కార్డు ఉండి ప్రస్తుతం వివిధ కారణాలతో తొలగించిన వారికి కూడా ఈకేవైసీ నమోదు కాలేదు. కొంత మంది గ్యాస్ ఏజన్సీల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకున్నా ఎర్రర్ చూపిస్తున్నాయి. దీంతో వేలాది మంది లబ్ధిదారులు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోని లబ్ధిదారులను గుర్తించి వారి ఇంటివద్దకే చేయించేలా శ్రీకారం చుట్టారు. ఈ విషయంపై ఇప్పటికే తహసీల్దారు మహ్మద్ నజీర్ గ్యాస్‌ఏజన్సీ వారికి దిశానిర్దేశనం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సిలిండర్లను అర్హులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ ఎంతవరకు సాధ్యపడుతుందో చూడాలి. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఏ కుటుంబంలో అయితే రెండు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయో అందులో ఒక కనెక్షన్‌కు మాత్రమే అర్హత ఉంది. ఎవరైనా గ్యాస్ కనెక్షన్ చాలా సంవత్సరాలు వాడకుండా ఉంటారో వారు అనర్హులవుతారు. బుక్ చేసిన మొదటి సిలిండరుకు ఈ పథకం వర్తిస్తుంది. బుక్ చేసుకోగానే అర్హులకు నేరుగా 48 గంటల్లో సబ్సిడీ డబ్బులు పడతాయి.

ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు



గండిలో మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చక్రాయపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మహాపూర్ణాహుతితో శుక్రవారం ఘనంగా ముగిశాయి. సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన వేదపారాయణ పండితులు, ప్రధాన అర్చకులు కేసరి అధ్యక్షతన పవిత్రోత్సవాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, మన్యసూక్త హోమం, అంజనేయస్వామి మూల మంత్ర హోమం, సుదర్శనహోమం, పవిత్ర విసర్జన సోమకుంభ ఉద్వాసన, మహాపూర్ణాహుతి, మహాకుంభ ప్రోక్షణ, నివేదన, శాత్తుమురై అనంతరం తీర్థ ప్రసాదాలను నొసంగారు. ఉదయం 6 నుంచి 1 గంట వరకు ఉత్సవాలు నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా గండి అంజనేయస్వామ దేవస్థానం భక్తులతో కిక్కిరిసిపోయింది. శివాలయం, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా అంజన్నను పూలమాలలతో ముంచెత్తారు. దేవస్థాన ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్లు వెంకటస్వామి, కావలి విజయభాస్కర్, పాలక మండలి సభ్యులు, వేదపారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్‌ప్లాంటు నిర్మాణానికి స్థల పరిశీలన



బి.మఠం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్‌ప్లాంటు నిర్మాణానికి సంబంధించి శుక్రవారం బ్రహ్మంసాగర్ సరిహద్దు ప్రాంతంలోని స్థలాన్ని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీ ప్రజల కరెంటు కష్టాలు తీర్చేందుకు సోలార్ పవర్‌ప్లాంటు నిర్మాణం కోసం బ్రహ్మంగారిమఠంలో 8ఎకరాలు భూమిని కేటాయించేందుకు స్థలాన్ని పరిశీలించామన్నారు. స్థానిక ఐదురోడ్ల కూడలిలో ఐదేళ్లుగా కోర్టులో పెండింగులో ఉన్న సర్వే నెం.444 స్థలాన్ని పరిశీలించామన్నారు. అనంతరం ఆయన వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. మండల తహసీల్దారు దామోదర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పుష్పగిరి వద్ద యువకుడి గల్లంతు



గల్లంతైన యువకుడు గణేష్ (ఫైల్), విషాదంలో బంధువులు

వల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించడానికి పెద్దఎత్తున భక్తులు పుష్పగిరి క్షేత్రానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో నదిలో ఓ బాలుడు ప్రమాదంలో ఉండగా.. కాపాడబోయిన యువకుడు నీటి ఉధృతికి గల్లంతయ్యాయడు. బాలుడు మాత్రం ప్రమాదం నుంచి బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కడప ఎన్జీవో కాలనీకి చెందిన రెడ్డిపల్లె గణేశ్ (27) తన భార్యతో కలిసి పుష్పగిరి క్షేత్రానికి వచ్చాడు. నదిలో బాలుడు కొట్టుకుపోవడం గమనించి కాపాడేందుకు నదిలోకి దిగాడు. నీటి ఉధృతికి గణేష్ కొట్టుకుపోగా చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో అక్కడున్న పోలీసులు, గ్రామస్తులు సహాయక చర్యలు చేపట్టారు. కానీ యువకుడి ఆచూకీ లభించకపోవడంతో ఈ విషయాన్ని సీఐ రోషన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి అక్కడకు వచ్చి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఫైర్ సిబ్బంది, రెస్క్యూటీంను తీసుకువచ్చి గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రాత్రి పొద్దుపోయే వరకు యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కాగా, గల్లంతైన యువకుడు గణేష్ కడపలో పుస్తకాల వ్యాపారం చేసేవాడని, నెలన్నర క్రితం వివాహమైందని బంధువులు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి.. తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సుబ్బలక్ష్మమ్మ

కాశినాయన, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డబ్బులు అడిగితే ఇవ్వలేదనే కోపంతో కట్టుకున్న భార్యపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని బాలరాజుపల్లె గ్రామంలో బసిరెడ్డి రామిరెడ్డి, సుబ్బలక్షుమ్మ దంపతులు నివశిస్తున్నారు. శుక్రవారం రామిరెడ్డి తనకు డబ్బులు ఇవ్వాలని సుబ్బలక్షుమ్మను అడిగాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఖర్చు చేస్తావంటూ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. రామిరెడ్డి ఆవేశంతో సుబ్బలక్షుమ్మను కత్తితో పొడిచాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



గూడూరు ఆశీర్వాదం (ఫైల్)

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన గూడూరు ఆశీర్వాదం (58) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సీ కాలనీలో ఆశీర్వాదం భార్య దేవమ్మలు నివాసముంటున్నారు. వీరికి మూడెకరాల సొంత భూమి ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, శనగ, పత్తి ఇతర పంటలు సాగుచేసేవాడు. పంటలు సక్రమంగా చేతికి రాక అప్పులపాలయ్యాడు. సుమారు రూ.3లక్షల మేర అప్పు ఉన్నట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు ట్రాక్ వద్ద తీవ్ర గాయాలతో యువతి



రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట గ్రామం రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం తీవ్ర గాయాలతో పడి ఉన్న యువతిని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న రైల్వే సిబ్బంది గాయపడిన యువతిని 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన యువతి తిరుపతిలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతోంది. బద్వేల్ నియోజకవర్గం బి.కోడూరు మండలం రాజుపాలెం పంచాయతీ వెంకటశెట్టిపల్లెకు చెందిన బి.రామసుధగా రైల్వే పోలీసులు గుర్తించారు. స్థానిక పోలీసులు కూడా ఆరాతీస్తున్నారు.

నెహ్రూ హయాంలో సహకార రంగానికి పెద్దపీట

- సీటీసీ ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీటీసీ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆధ్వర్యంలోనే సహకార రంగానికి పెద్దపీట వేశారని కో ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటరు ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక డీసీఎంఎ కార్యాలయంలో శుక్రవారం జాతీయ సహకార దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 71వ జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. డీసీఎంఎస్‌లో గత ఏడాది ఎంత ప్రగతి సాధించాం, ఈ ఏడాది ఎంత సాధించాం అనే లోటుపాట్లపై చర్చించుకునేందుకు ఇలాంటి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సహకార రంగంలో ముఖ్యమైన వ్యక్తుల సలహాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ వైఎస్ సత్యానందం మాట్లాడుతూ రైతు ప్రయోజనం కోసం సహకారరంగం ఏర్పడిందన్నారు. సహకార బ్యాంకు ద్వారా రుణం పొందితే భవిష్యత్తులో రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. సీటీసీ ఫణిరాజ్ మాట్లాడుతూ దేశానికి రాజ్యాంగం ఎంత ప్రాముఖ్యమో సహకారరంగంలో సంఘాలకు బైలా అంత ముఖ్యమైందన్నారు. సొసైటీలో ఆర్థికంగా నష్టం వస్తే ఆ సొసైటీ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుభాష్‌చంద్రబోస్, డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ బిజినెస్ మేనేజరు ఖాదర్‌వల్లి మాట్లాడారు. సమావేశానికి ముందుగా సహకార పతకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సహకార సిబ్బంది, డీసీఎంఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛను విధానం అమలు చేయాలి

ఏఐఎస్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న సదానంద గౌడ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఏఐఎస్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్జీయూ భవన్‌లో ఆయన మాట్లాడుతూ లక్షలాది ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలు సీపీఎస్‌తో ఇబ్బంది పడుతున్నాయని.. చాలా రాష్ట్రాలు సీపీఎస్ రద్దు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాయన్నారు. దేశవ్యాప్తంగా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కుగా భావించి పాత పింఛను విధానం వెంటనే అమలు చేయాలన్నారు. ఎన్జీయూ రాష్ట్రనాయకులు సురేశ్‌బాబు, బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, రాష్ట్ర మున్సిపల్ కన్వీనరు రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తోందని.. పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సహక కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధశాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సహకాన్ని పెంపొందించేందుకు ప్రభు త్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయాలన్నారు. నూతన ఇండస్ట్రియల్ విధానానికి అనుగుణంగా జిల్లా ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనన్నట్లు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలను ఔత్సాహికపారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో మౌలిక వసతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సహాయ సహకారాలను అందివ్వాలన్నారు. జిల్లాలో గోల్డ్, టెక్స్‌టైల్ క్లస్టర్ల ఏర్పాట్ల అభివృద్ధికి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో పరిశ్రమల జీఎం చాంద్ బాషా, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, లీడ్ బ్యాంకు మేనేజరు జనార్దన్, డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబరు శ్రీకాంత్ నాయక్, డిక్కీ కో-ఆర్డినేటర్ శివవంకర్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఇసుక సరఫరా : జేసీ



దర్జీపల్లె ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు అనుగుణంగా ఇసుక సరఫరా చేపట్టాలని జేసీ అదితిసింగ్ అన్నారు. శుక్రవారం దర్జీపల్లెలోని ఇసుక క్వారీని అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఉచితంగా ఇసుక పంపిణీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని.. ఎలాంటి అవకతవకలు లేకుండా ఇసుకను సరఫరా చేయాలన్నారు. ఇసుక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నదిలోకి వెళ్లే వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని, డంపింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్టాక్‌పాయింట్‌ను పరిశీలించి రోజువారీగా ఎన్ని టిప్పులు ఇసుక వెళుతుంది.. సామాన్య ప్రజలు ఎంతమంది వస్తున్నారనే దానిపై పరిశీలించారు. సచివాలయంలో సౌలభ్యంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఇసుకను తరలించాలని సూచించారు. గ్రామంలో పెద్దఎత్తున టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తే రోడ్లు దెబ్బతింటాయని స్థానికులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు ఇసుక తరలింపులో అక్రమాలకు చోటు లేకుండా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు వెంకటరమణమ్మ, భూగర్భగనుల శాఖ సంచాలకులు సూర్యకుమార్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వో అంజి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొరవడిన నిఘా



- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఒక కానిస్టేబుల్‌తోనే విధులు
- అధికారులు అంతంత మాత్రమే

కడప క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. అధికారులు కూడా అంతంత మాత్రంగా ఉన్నారు. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై నిఘా కొరవడింది. అలాగే హోటల్స్‌లో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా. ట్రాన్స్‌పోర్టులలో బిల్లులు, రేషన్ బియ్యం , ఇసుక అక్రమ రవాణాతో పాటు నిల్వ పాయింట్లు, మైనింగ్, ఎరువుల విక్రయాలు, గ్రావెల్స్ తవ్వకాలు తదితర అంశాలపై విజిలెన్స్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపడతారు. లోపాలున్న వారిపై కేసులు కూడా నమోదు కూడా చేస్తారు. అయితే గత కొన్ని నెలలుగా ఈ శాఖలో సిబ్బంది కొరత కారణంగా విజిలెన్స్ దాడులు జరగడం లేదు. దీంతో ఇష్టానుసారం అవినీతి, అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ప్రాంతీయ కార్యాలయానికి సంబంధించి అదనపు ఎస్పీ, డీఎస్పీ ఉంటారు. అయితే అదనపు ఎస్పీ మాత్రమే ఉన్నారు. డీఎస్పీ అధికారి ప్రస్తుతం లేదు. అలాగే ముగ్గురు సీఐలు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. ఎస్ఐలు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. అలాగే ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్ ఉండగా ప్రస్తుతం ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఎంపీడీవో ఒకరు ఉండగా ఆ స్థానం కూడా ఖాళీగానే ఉంది. ముగ్గురు డీఈలు ఉండాల్సి ఉంటే ఇరువురు మాత్రమే ఉన్నారు. ఇక తహసీల్దారు అయితే ఒకరు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం లేరు. ఈ స్థానం గత నాలుగేళ్ల నుంచి ఖాళీగానే ఉన్నట్లు తెలుస్తుంది. అసిస్టెంట్ జియాలజిస్ట్ ఒకరు ఉండాల్సింది.. అయితే ఇక్కడ ఎవరూ లేరు. ఇక జూనియర్ అసిస్టెంట్లు కూడా ఇక్కడ లేకపోవడంతో ఉన్న సిబ్బందికి పని భారంగా మారుతోంది. ఏదిఏమైనా ప్రభుత్వం సంక్షేమాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఈ శాఖ తనిఖీలు చేపట్టాల్సి ఉంది. అయితే ప్రస్తుతం సిబ్బంది కొరతతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేస్తే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు తనిఖీలు ముమ్మరంగా సాగుతాయని పలువురు చెప్పుకొస్తున్నారు.



అక్కదేవతల విగ్రహ ప్రతిష్ఠ



అక్కదేవతల ఆలయంలో సుగవాసి

సుండుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో శుక్రవారం అక్కదేవతల విగ్రహ ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, కూటమి నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. సరస్వతి, రెడ్డెయ్య నాయుడు కుటుంబీకులు అన్నదానం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు చప్పిడి రమేష్ నాయుడు, దామోదర్ నాయుడు, శివకుమార్ నాయుడు, చెన్నంశెట్టి రామాంజులు, యూనియన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

సుండుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందులవారిపల్లెలో ఈ నెల 18 సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. 20వ తేదీన సీతారాముల కల్యాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మండలం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

ఎస్సీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా రామకృష్ణ



గాలివీడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల ఎం ఆర్ పి ఎ స్. నాయకుడు రామ కృష్ణ అన్నమయ్య జిల్లా ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా నియమి తులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ఈ బాధ్యత అప్పగించేందుకు సహకరించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కరెంటు కోత

పెనగలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంటు కోత ఉంటుందని ఏఈ సయ్యద్ షఫీ తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు


చిన్నమండెం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయాల్లో గ్రంథాలయాల్లో గడిపితే భవిష్యత్తును తీర్చిదిద్దుకునే దానికి ఇది ఒక్క చక్కటి అవకాశం లభిస్తుందన్నారు. పత్రికల్లో వచ్చే కరెంట్ అఫైర్స్ పోటీ పరీక్షలకు ఎంతగానో దోహదపడాయన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఎంత పెరిగినా తరిగిపోని ఆస్తి విద్య ఒక్కటేనని కావున ఈ వారోత్సవాలను ప్రతి పౌరుడు వినియోగించుకోవాలనిగ్రంథపాలకుడు అంజనేయులురెడ్డి తెలిపారు.

సంబేపల్లె: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ అధికారి రెడ్డిశేఖర్ తెలిపారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు 20వ తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. విద్యార్థులు నిత్యం గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేసుకోవచ్చునన్నారు.

నీళ్లు లేని చెరువులు..

బీడువారిన భూములు

●విస్తారంగా వర్షాలు కురిసినా.. తీరని కరువు ● రబీ సాగుపై ఆశలు వదులుకున్నరైతన్నలు



చుక్కనీరు లేని ఇనాయత్‌ఖాన్‌చెరువు (ఇన్‌సర్ట్)పిచ్చిమొక్కలతో నిండిన శిబ్యాల చెరువు

రాయచోటిటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విస్తారంగా వర్షాలు కురిసినా చెరువుల్లోకి చుక్కనీరు రాకపోవడంతో ఆయకట్టు భూములన్నీ బీళ్లుగా మారాయి. రాయచోటి మండల పరిధిలోని 9 గ్రామ పంచాయతీల్లో సుమారు వందకుపైగా కుంటలు, చెరువులుఉన్నాయి. ఈ చెరువుల కింద వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు ఆశించిన స్థాయిలో కురుస్తున్నా ఏ చెరువులోకీ చుక్కనీరు చేరిన దాఖలాలు లేవు. దీంతో వర్షాధారంగా సాగుచేసిన వేరుశనగ ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దీంతో రైతులు రబీపై ఆశలు పెట్టుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి చెరువులు నిండితే ప్రస్తుతం వరి సాగు చేయాల్సి ఉంది. అయితే రబీ సీజన్ ప్రారంభం అయినా ఇప్పటి వరకు మండలం లోని చెరువుల్లో పశువులు తాగడానికి కూడా నీరు లేకపోవడంతో రైతన్నలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 1800 ఎకరాల్లో వేరుశనగ సాగు చేయాల్సి ఉండగా, ఈ ఏడాది కేవలం 880 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాలను దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా విత్తనకాయలతో పాటు ఉలవలు కూడా పంపిణీ చేశారు. రెండు మూడు తుఫానులు కూడా జిల్లాను పలకరించాయి. అయినా, చెరువుల్లోకి నీరు చేరలేదు. దీంతో ఇప్పటి వరకు ఒక సెంటు భూమి కూడా సాగులోకి రాలేదు. దీంతోఈ ఏడాది కూడా వరి సాగు లేనట్లేనా అంటూ రైతులు నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారు.

రబీ సాగుపై ఆశలు వదులుకున్నాం

వరి పంట సాగుపై ఆశలు వదులుకున్నాం. రబీ సీజన్ ప్రారంభమైనా చెరువుల్లోకి నీరు రాకపోవడంతో వరి సాగు చేసే పరిస్థితులు లేవు. శిబ్యాల కస్బాకు సమీపంలోని పెద్దచెరువు ఏడాదినుంచి చుక్కనీరు లేక నెర్రెలు వారింది. దీంతో పొలాలన్నీ కంపచెట్లతో నిండిపోయాయి.

- షేక్. బాషా, రైతు, శిబ్యాల, రాయచోటి

కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్నాం

వర్షాలు కురుస్తున్నా చెరువుల్లోకి నీరు రాకపోవడంతో వరిపంటను సాగు చేయలేకపోతున్నాం. రెండేళ్లుగా మండ లంలో వరి సాగుకు నోచుకోలే దు. ఆయకట్టు కింద భూములున్నా.. చెరువుల్లో నీరు లేక పోవడంతో తిండిగింజలు కొనుక్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వ పరిహారం అందించి ఆదుకోవాలి.

- గొనిపల్లి బాలాజీ, రైతు, రాయచోటి

అర్జీదారుల సమస్యలకు వేగంగా పరిష్కారం చూపాలి

● ఆర్డీవో శ్రీనివాసులు



గాలివీడు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

గాలివీడు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): అర్జీఆరులు సంతృప్తి చెందేలా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆర్డీవో ఏ. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని వంద శాతం పరిష్కరించాలన్నారు. అనంతరం చుక్కలు, ఇనాం భూములు, రీవెరిఫికేషన్, ధ్రువీకరణ పత్రాల మంజూరు అంశాలపై సూచనలిచ్చారు. అర్జీదారులతో ఫోన్‌లో మాట్లాడి స్థానిక అధికారుల పనితీరుపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

వర్గాలకు అతీతంగా పనిచేసే నాయకుడు కావాలి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రాజంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వర్గాలకు అతీతంగా కార్యకర్తలను కలుపుకుని పోయి అభివృద్ధికి పాటుపడే నాయకుడు కావాలని మండల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజంపేట పట్టణంలోని ఓ కల్యాణమండపంలో మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల టీడీపీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధాన నాయకులు వర్గ రాజకీయాలను నిర్వహిస్తుండడంతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా నియోజకవర్గ ఇన్‌చార్జిని ఎంపిక చేయాలని, కార్యకర్తలకు అండగా ఉన్న నేతను ఎన్నుకోవాలని అధిష్ఠానం వర్గాన్ని కోరారు టీడీపీ నాయకుల ఐక్యత కోసమే ఈ సమావేశాన్ని నిర్వహించామన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు, కాకతీయ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు శివనారాయణచౌదరి, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి అజయ్, మండల సీనియర్ నాయకుడు కూచివారిపల్లె వెంకటయ్యనాయుడు, పార్లమెంట్ అధ్యక్షురాలు అనసూయమ్మ, మైనార్టీ నాయకులు అబూబకర్, రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాజంపేటలో ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

రాజంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పెద్దఎత్తున టీడీపీ సభ్యత్వాలు నమోదయ్యాయని రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాజంపేటలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని పొరపాట్ల వల్ల రాజంపేటలో టీడీపీ అభ్యర్థి ఓటమి చెందినా ప్రస్తుతం సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో అందరూ సంఘటితంగా పనిచేస్తున్నారన్నారు. ఇక్కడ ఎవరికీ ఎలాంటి పదవులు లేకున్నా 40 వేలు పైచిలుకు సభ్యత్వాలు నమోదు కావడం నాయకులు, కార్యకర్తల సమష్టి కృషికి నిదర్శనమన్నారు.గతంలో రాజంపేటలో టీడీపీ అభ్యర్థిని గెలిపించినా 25 వేల సభ్యత్వాలు కాలేదని, ఇప్పటికే 40 వేల సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాము యాదవ్, ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



గిరిజనులతో మాట్లాడుతున్న రాజశేఖర్

రైల్వేకోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన కాలనీ వాసులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరపురం గిరిజన కాలనీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి వారికి ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి రాగానే మరిచిపోతున్నారని ఆరోపించారు. గిరిజనులు చాలీచాలని ఆదాయంతో దుర్భర జీవనం అనుభవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా గిరిజనుల తలరాతలు మారలేదన్నారు. ఇంటి స్థలాలపై ఈ నెల 18న ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో సీపీఐ నాయకులు శెట్టిపల్లె నరసయ్య, జ్యోతిప్రియ, కృష్ణవేణి, లక్ష్మీదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్తీక దీప కాంతుల్లో ఆలయాలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్ని శివాలయాల్లో శుక్రవారం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు,, పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించి అన్నదానం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. రాయచోటిలోని వీరభద్రాలయంలో నిర్వహించిన గుగ్గిలం పూజ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడుమండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. పలు ఆలయాల్లో సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు







1. రాజంపేట శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు
2.రాయచోటి: ఉమామహేశ్వరాలయంలో సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న పండితులు
3. సిద్దవటం: ఉమా సహిత నీలకంఠేశ్వరస్వామి కల్యాణం సందర్భంగా తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

ఆదివాసీ విప్లవ వీరుడు బిర్సా ముండా



మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బిర్సా ముండా అని సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కొనియాడారు. శుక్రవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఆదివాసీల్లో తొలి విప్లవ వీరుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని ఆయనతోపాటు, బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బిర్సాముండా జయంతి రోజైన నవంబరు 15ను జన జాతీయగౌరవ దినస్‌గా జరుపుకుంటున్నామన్నారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి సందప్ప, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రైల్వేకోడూరు జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ, జిల్లాలోని గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: మండలంలోని రాఘవరాజపురం సచివాలయం పరిధిలోని గిరిజన కాలనీలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ఆధ్వర్యంలో భగవాన్ బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ బిర్సా ముండా గిరిజన సమాజానికి చేసిన సేవలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కా రూపానంద రెడ్డికి ముస్లింల సన్మానం

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అడా ఛైర్మన్, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డిని శుక్రవారం ముక్కవారిపల్లె గ్రామంలో నియోజకవర్గంలోని ముస్లింలు సన్మానించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈద్గా సమస్యను పరిష్కరించాలని కోరారు. షాదీ ఖానా మంజూరు చేయాలని విన్నవించారు.

'ప్రతిపక్ష హోదా అడగడం సిగ్గుచేటు'

సుండుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల తీర్పును గౌరవించకుండా జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష హోదా అడగడం సిగ్గుచేటని రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు విమర్శించారు. శుక్రవారం మండలంలోని చింతలయ్యగారిపల్లిలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఆయనతోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి అనుచరులు చేసిన అరాచకాలను ఎండగడతారన్న భయంతో ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని డొంక తిరుగుడు మాటలు చెబుతున్నాడన్నారు. తమకు ఓటు వేసి గెలిపించిన ప్రజల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాల్సిన వైసీపీ ఎమ్మెల్యేలు, అభివృద్ధిని అడ్డుకునేందుకు విమర్శలు గుప్పించడం హాస్యాస్పదమన్నారు. టీడీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేల్లో నలుగురిని లాగేస్తే ప్రతిపక్ష హోదా ఉండదని గతంలో హేళన చేసిన విషయం మరిచిపోయావా అని గుర్తుచేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు కోళ్లే రెడ్డప్ప, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు, మండల మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌బాబు నాయుడు, సురేష్ నాయుడు, ఎల్వీ రమణ, మంగిరి సురేష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించండి'



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో బాలకృష్ణారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డీపీవో బాలకృష్ణారెడ్డి సూ చించారు. గిరిజన నాయకుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారి శుధ్యం, వీధిదీపాలు, బోర్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించా లన్నారు. తాగునీటి సమస్యలు ఎదురవకుండా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. ఎంపీడీవో రెడ్డెయ్య, మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

'ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం'

రాయచోటిటౌన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యతను కాపాడుకోవడమే ఎల్ఐసీ కళాజాతా లక్ష్యమని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి జీ. తిరుపతమ్మ, ఉపాధ్యక్షురాలు సుజాత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎల్ఐసీ యూనియన్ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, వ్యవసాయం, పరిశ్రమలు, స్టీల్, రైల్వేలు, ఆయిల్ రంగాల్లో సొంత కాళ్లపై నిలబడడానికి ప్రభుత్వ రంగ సంస్థలే కారణమని, వాటిని బలహీన పర్చడం దేశానికి మంచిది కాదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ఎల్ఐసీ, పోస్టల్ రంగాల విశ్వసనీయతకు, బీఎస్ఎన్ఎల్ ఇటీవల మళ్లీ పుంజుకోవడానికి, ఇప్పటికీ జాతీయ బ్యాంకులకు, గ్రామీణ బ్యాంకులకు ప్రజల మద్దతు కొనసాగడానికి ఆ సంస్థల పనితీరే కారణమన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కళాజాతాలో హైదరాబాద్ యూనియన్ నేతలు గిరిధర్, మద్దిలేటితో పాటు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, ఎల్ఐసీ యూనియన్, యూటీఎఫ్, కేవీపీఎస్ , మున్సిపల్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ లీడర్లు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు అరికట్టండి



రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఒంటిమిట్ట టీడీపీ నాయకులు

రాజంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో ఒంటిమిట్ట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు జరిగాయని ఆ మండల టీడీపీ నాయకులు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్‌కు విన్నవించారు. శుక్రవారం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్వీ రమణ, నాయకులు ముద్దా కృష్ణారెడ్డి, బోడే రమణ, ఓబుల్‌రెడ్డి తదితరులు మంత్రిని కలిశారు. ఆక్రమణబారిన పడిన భూముల సర్వే నంబర్లను మంత్రికి అందజేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ఫ్యాక్స్ ద్వారా కడప కలెక్టర్‌కు ఆదేశాలు పంపారు.

అత్తిరాల క్షేత్రానికి జనరేటర్ విరాళం



జనరేటర్ అందజేస్తున్న గుగ్గిళ్ల సోదరులు

రాజంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అత్తిరాల దేవాలయానికి రాజంపేట పట్టణం బలిజపల్లెకు చెందిన మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, హరిట్రేడర్స్ అధినేత గుగ్గిళ్ల హరిప్రసాద్, గుగ్గిళ్ల రవిశంకర్ సుమారు లక్ష రూపాయలు విలువ చేసే జనరేటర్‌ను ఆలయానికి అందజేశారు. వారి తల్లి దండ్రులు గుగ్గిళ్ల చిన్నయ్య, నాగరత్నమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. నందలూరు ఎంఈవో లంకా నాగయ్య, గుగ్గిళ్ల శేఖర్, రెడ్డయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేనకూరు సెజ్‌లో ఉద్యాన విద్యార్థులు



కాఫీ తయారీని వివరిస్తున్న సంస్థ జీఎం మనీష్

రైల్వేకోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల సందర్శనలో భాగంగా అనంత రాజుపేట ఉద్యాన కళాశాల నిమ్మ పరిశోధన స్థానంలో శిక్షణ పొందుతున్న 12 మంది విద్యార్థులు శుక్రవారం తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలోని మేనకూరు సెజ్‌ను సందర్శించారు. పెటూరు నిమ్మ పరిశోధన సంస్థ అధిపతి డాక్టర్ పి. శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేనకూరు సెజ్‌లోని ఇండూ కాఫీ పరిశ్రమలో ఫ్రీజ్ డ్రైయింగ్ పద్ధతిని పరిశీలించారు. సెజ్ లోని మరి కొన్ని పరిశ్రమలు సందర్శించి ఉత్పత్తుల తయారీని తెలుసుకున్నారు. నిమ్మ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ కాందర్‌నాయక్, ఉద్యాన కళాశాల చెందిన ఏడీఆర్ డాక్టర్ బి. హరి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

స్ర్కీనింగ్ పరీక్షలు వేగవంతం చేయండి



స్ర్కీనింగ్ పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో నాగరాజు

సిద్దవటం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు వేగవంతం చేయాలని కడప జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆదేశించారు. మండలంలోని టక్కోలి బీసీ కాలనీలో శుక్రవారం ఆయన స్ర్కీనింగ్ పరీక్షలను తనిఖీ చేశారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి ఫీవర్ సర్వే, లార్వా చేయించారు. పి.కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మీ, సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం

సంబేపల్లె, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 19వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించి, ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు చేసిన ఉపాధి పనులపై ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 4 నుంచి 15 వరకు సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో జరిగిన పనులపై శుక్రవారం మండల స్థాయిలో సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నారన్నారు. సర్పంచులు, ఎంపీటీలు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ సమావేశానికి హాజరుకావాలన్నారు

ఉపాధి హామీ గ్రామసభల్లో అందరూ పాల్గొనాలి

చిన్నమండెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభల్లో పీడీ వెంకటరత్నం పాల్గొన్నారు. అవసరమైన పనులను గుర్తించి ఉపాధి హామీ పథకం కింద చేసుకునేలా తీర్మానం చేయనుండడంతో ఈ సభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని సలహాలు ఇవ్వాలని సూచించారు. ఏపీడీ నరసయ్య, ఈసీ సూర్యప్రకాశ్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో కృష్ణజింకకు తీవ్రగాయాలు



ములకలచెరువు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో ఓ కృష్ణజింక తీవ్రంగా గాయపడ్డ సంఘటన శుక్రవారం ములకల చెరువు సమీపంలో చోటు చేసుకుంది. కుక్కల బారిన పడ్డ కృష్ణజింకను కూలీలు రక్షించారు. ములకలచెరువులోని పీటీఎం రోడ్డులో ఉన్న టీటీడీ కళ్యాణ మండపం సమీపంలోని పంట పొలాల వద్దకు వచ్చిన కృష్ణ జింకపై కుక్కల గుంపు దాడి చేసింది. ఈ సమయంలో బొలెరో వాహనంలో అటుగా వచ్చిన టమోటా మండీ కూలీలు కుక్కల బారి నుంచి కృష్ణజింకను రక్షించారు. గాయపడ్డ జింకను వాహనంలో పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. దీంతో పోలీసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. గాయపడ్డ కృష్ణజింకకు అటవీశాఖ అధికారులు స్థానిక పశువైద్యశాలలో చికిత్సలు అందించి కనుగొండ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్‌ఫొటో)

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో కొత్తమాధవరానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం పుత్తా శ్రీనివాసులు (56) తన భార్యతో కలసి స్థానిక మృకుండ మల్లేశ్వరాలయానికి వెళ్లాడు. పూజల అనంతరం తిరిగి వచ్చే క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా కడప నుంచి తిరుపతి వైపు వెళుతున్న రైలు దూసుకువచ్చింది. దీంతో పట్టాల అవతల ఉన్న వారిని రావద్దని చేతితో సైగలు చేస్తుండగా రైలు బలంగా ఢీకొంది. దీంతో చేయి విరిగి దూరంగా పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య ప్రమాదం నుంచి తప్పించుకుంది. వీరి కూతురు ప్రస్తుతం బీటెక్ చదువుతుండగా, కుమారుడికి మతి స్థిమితం లేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

టమోటా మార్కెట్‌లో కూలీ మృతి

కురబలకోట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు టమోటా మార్కెట్‌లో చాంద్‌బాష(45) అనే కూలీ మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం ఇందిరానగర్‌కు చెందిన చాంద్‌బాష హమాలీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కూలి పనుల నిమిత్తం అంగళ్లు టమోటా మార్కెట్‌కు వచ్చి రాత్రి 8 గంటల సమయంలో లారీకి టమోటా క్రేట్‌లను లోడ్ చేస్తుండగా నేలపై పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు కుటుంబీకులకు తెలిపారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కోటిరెడ్డిగారిపల్లె సమీపంలో సాగులో ఉన్న అరటి తోట

జిల్లాలోని తూర్పు ప్రాంతమైన రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో అరటి సాగు ఎక్కువ. ఇక్కడ బొప్పాయి, మామిడి తోటలు ఉన్నప్పటికీ అరటికి పెట్టింది పేరు. అలాంటిది ఇటీవల పడమటి మండలాల్లోనూ అరటిసాగు పెరుగుతోంది. అయితే ఇక్కడ ఎక్కువ ఆదాయాన్నిచ్చే యాలక్క రకం అరటిని సాగుచేస్తున్నారు. ఒకసారి సాగు చేస్తే మూడు పర్యాయాలు దిగుబడి వస్తోంది. కూలీల, మందుల పిచికారి ఖర్చులు కూడా చాలా తక్కువ. పెట్టుబడి కంటే ఆదాయం రెట్టింపు వస్తుండటంతో రైతన్నలు అరటి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

అధిక లాభాల అరటి

- కూలీలు, మందుల పిచికారి ఖర్చులు చాలా తక్కువ
- ఒకసారి సాగు చేస్తే మూడుసార్లు దిగుబడి
- పడమటి మండలాల్లో పెరుగుతున్న సాగు

ములకలచెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గం పంటల సాగు ప్రయోగాలకు నిలయంగా నిలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో విదేశీ పంట డ్రాగన్, అరబ్ దేశాల్లో పండే ఖర్జూరం సాగు చేసి రైతులు మంచి ఫలితాలు సాధించారు. అలాగే అనంతపురం జిల్లాలో అత్యధికంగా తమలపాకులు కూడా సాగు చేస్తున్నారు. తాజాగా రైతన్నలు అరటి సాగుపై దృష్టి సారించి మంచి దిగుబడులు సాధిస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు. అరటి సాగుకు నీరు కూడా తక్కువగా అవసరమతుంది. మందుల పిచికారి ఒక్కసారి మాత్రమే చేస్తున్నారు. కూలీల అవసరం అతి తక్కువ. పంట సాగు చేసిన మొదటి ఏడాది మాత్రం ఖర్చు కొంచెం ఎక్కువగా ఉంటుంది. తర్వాత రెండేళ్లు ఖర్చు చాలా తక్కువ. ఈ కారణంగా అరటి పంట సాగుపై అన్నదాతలు మక్కువ చూపుతున్నారు. పంట తొలిసారి సాగు చేసినప్పుడు రూ.70వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు వస్తోంది. తరువాత ఏడాది ఖర్చు రూ.40వేల వరకు తగ్గుతుంది. మూడవ ఏడాది ఖర్చు మరింత తగ్గుతుంది. ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో అరటి సాగు ప్రయోగాత్మ కంగా సాగు చేసి మంచి ఫలితాలు సాధించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా అరటి సాగులో ఉంది. దాదాపు 80 ఎకరాల్లో ఇక్కడ అరటి సాగులో ఉంది. వీటిలోనూ ఎక్కువమంది యాలక్క రకం సాగు చేస్తున్నారు. ఇవి షుగర్ జబ్బు ఉన్న వారు కూడా తినొచ్చు. దీంతో వీటికి ధర ఎక్కువ. ఇవి సాధారణంగా కర్ణాటకలో ఎక్కువగా సాగు చేస్తారు. ఇప్పుడు తంబళ్లపల్లె నియోజకవర్గం లోనూ సాగు చేస్తుండటం విశేషం.

నీటి వినియోగం తక్కువ

మిగిలిన పంటలతో పోలిస్తే అరటి పంట సాగుకు నీటి వినియోగం చాలా తక్కువ. డ్రిప్ ఇరిగేషన్ కింద పంట సాగు చేస్తున్నారు. అరటి పంటకు వేసవిలో రెండు లేదా మూడు రోజులకు ఒకసారి నీరు వదలాల్సి ఉంటుంది. తరువాత ఐదు రోజులకు ఒకసారి నీరు అందించినా ఫరవాలేదు. కర్ణాటక రాష్ట్రం నుంచి మొక్కలు తెచ్చి నాటుతున్నారు. ఎకరాకు 1200 మొక్కలు నాటాల్సి ఉంటుంది. సాగు చేసిన 10 నుంచి 11 నెలలకు మొదటిసారి దిగుబడి వస్తోంది. తరువాత ఏడాది ఏడు నెలలకే దిగుబడి వస్తుంది. మూడోసారి ఆరు నెలలకే దిగుబడి వస్తుంది. ఆశించిన స్థాయిలో ధరలు ఉంటే మాత్రం రైతు పంట పండినట్లే. ములకలచెరువు మండలం దుగుసానివారి పల్లెకు చెందిన రైతు యాలక్క రకం అరటి ఐదు ఎకరాలలో సాగు చేశారు. వీటిని బెంగళూరులోని దన్నేపేట బనానా మార్కెట్‌కు తరలించి విక్రయించారు. అన్ని ఖర్చులు పోను ఎకరాకు రూ.4లక్షల ఆదాయం వచ్చిందని రైతు తెలిపారు. ములకలచెరువు మండలం కోటిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు కర్ణాటక రాష్ట్రం నుంచి జీ-6 రకం మొక్కలు తెచ్చి ఐదెకరాలలో అరటి సాగు చేశారు. మొదటి కాపులో రూ.10లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఇలా ఒకరిని చూసి ఒకరు పడమటి మండలాల్లోనూ అరటి సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, పులివెందుల నియోజకవర్గాల్లో మాత్రమే అరటి పెద్ద ఎత్తున సాగయ్యేది. ఇప్పుడు మెల్లగా పడమటి ప్రాంతానికీ విస్తరిస్తోంది. ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ కావడంతో రైతులు దీనిపై మక్కువ చూపుతున్నారు.



పర్తికోట సమీపంలో యాలక్క రకం అరటి గెలలు



పర్తికోట నుంచి బెంగళూరు మార్కెట్‌కు తరలిస్తున్న అరటిగెలలు

ఖర్చు చాలా తక్కువ



అరటి తోట సాగుకు ఖర్చు చాలా తక్కువ. ఒకసారి పంట సాగు చేస్తే మూడుసార్లు దిగుబడి వస్తుంది. ఐదు ఎకరాల్లో యాలక్క రకం సాగు చేసి రూ.5లక్షలు ఖర్చు చేశా. మొదటి ఏడాదే రూ.20లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఇప్పుడు రెండవ ఏడాది దిగుబడి వస్తుంది. ఎక్కువ గాలులు వీస్తే తోటకు ఇబ్బంది. అరటి సాగు మంచి ఫలితాలు ఇస్తోంది.

- మనోహర్‌రెడ్డి, దుగుసానివారిపల్లె, ములకలచెరువు మండలం

మందులు పిచికారి ఒక్కసారే



ఐదు ఎకరాల తోటకు ఒక్కసారి మాత్రమే మందులు పిచికారి చేశాము. తురువాత ఎలాంటి మందులు వాడలేదు. మంచి దిగుబడి వచ్చింది. వ్యాపారులే తోట వద్దకు వచ్చి అరటి కాయలు కొనుగోలు చేసి కొనుక్కెళ్లారు. మొదటిసారి రూ.10లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఇక గెల 33-35 కిలోలు ఉంది. కష్టం కూడా తక్కువే.

- రమణారెడ్డి, కోటిరెడ్డిగారిపల్లె, ములకలచెరువు మండలం

రైతులకు తగిన న్యాయం చేస్తాం

- రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్

గుర్రంకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అక్రమాలకు గురైన రైతుల పొలాలను రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి రైతులకు న్యాయం చేస్తామని రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీనివాస్ అన్నారు. ప్యారంపల్లె గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ భూములను ఓ వ్యక్తి దౌర్జన్యంగా అక్రమించుకొని ఇబ్బందులు పెడుతున్నారంటూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీనివాస్ రైతుల భూములు ఆక్రమించి ఫెన్సింగ్ వేసిన వ్యక్తి భూములను రైతులతో కలిసి పరిశీలించారు.

గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిగ రెవెన్యూ గ్రామంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రైతుల నుంచి భూములు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో ప్యారంపల్లె గ్రామానికి చెందిన కొందరి రైతుల పొలాలు వ్యాపారి కొన్న భూముల మధ్యలో ఉన్నాయి. దీంతో వ్యాపారి తన భూమి చుట్టూ రాతికూసాలు నాటి ఫెన్సింగ్ వేశాడు. ఈ క్రమంలో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లడానికి వీలులేకుండా పోయింది. అంతేకాకుండా కొందరు రైతుల పొలాలను దౌర్జన్యంగా లాక్కొని అక్రమాలకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన రైతులు డిప్యూటీ సీఎంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీనివాస్‌లు ముందుగా ప్యారంపల్లె రైతులతో మాట్లాడారు. అనంతరం అక్రమాలకు గురైన రైతుల పొలాలను పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందిని అడిగి రికార్డులను పరిశీలించి, వివరాలను సేకరించారు. భూముల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. అక్రమాలకు గురైన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్యారంపల్లె రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

రాత్రికి రాత్రే పంచాయతీ స్థలం ఆక్రమణ

వాల్మీకిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీ స్థలంలో రాత్రికి రాత్రే ఆక్రమణదారులు పాగా వేశారు. ఎవరి అనుమతి లేకుండా ఓ బంకును ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట ఇటీవల రెండు రోజుల క్రితం పంచాయతీ అధికారులు దుర్గంధంగా ఉన్న స్థలాలను శుభ్రం చేశారు. అయితే ఈ స్థలాల్లో గురువారం రాత్రికి రాత్రి ఓ బంకును ఏర్పాటు చేసి వ్యాపారాలకు తెరలేపారు. గురువారం ఉదయం నుంచి ఆ ప్రాంతంలో రహస్యంగా ఏర్పాటు చేసిన ఆ బంకు ఎవరన్నది అధికారులకు సైతం వివరాలు తెలియరాక పోవడం గమనార్హం. గ్రామ పంచాయతీ స్థలాల్లో, అందులోనూ అధికారుల అనుమతులు లేకుండా బంకును ఏర్పాటు చేశారంటూ సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై స్థానిక పంచాయతీ ఈవో రవీంద్రనాథ్‌ను వివరణ కోరగా ఆ ప్రాంతంలో బంకు ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, పరిశీలించి తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పంచాయతీ స్థలాలలో అక్రమణలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి రోడ్డులో రాత్రికి రాత్రి వెలసిన బంకు

వయోవృద్ధుల గుర్తింపు కార్డులపై స్పష్టత

కలికిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వయోవృద్ధులకు రాయితీ టికెట్ల కోసం చూపించే గుర్తింపు కార్డుల విషయంపై ఆర్టీసీ అధికారులు స్పష్టత ఇచ్చారు. ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే 60 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు టికెట్టు ధరపై 25 శాతం రాయితీ వున్న విషయం తెలిసిందే. అయితే వయసు నిర్ధారణ కోసం వీరు చూపించే గుర్తింపు కార్డుల విషయంలో అనేక రకాల పేచీలు రావడం పరిపాటిగా మారింది. ఇది పలు వివాదాలకు కూడా దారితీసింది. దీన్ని గుర్తించి ఆర్టీసీ యాజమాన్యం గుర్తింపు కార్డుల గురించి పూర్తి స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (ఆపరేషన్స్) ఈ మేరకు కింది స్థాయి అధికారులు, ఉద్యోగులకు పలు సూచనలు జారీ చేశారు. పలువురు వయోవృద్ధులకు ఇతర రాష్ట్రాల్లో ఆధార్‌కార్డు నమోదైన కారణంగా రాయితీ టిక్కెట్లతో ప్రయాణానికి అంగీకరించడం లేదని ఈడీ వెల్లడించారు. కేవలం ఆధార్ కార్డు కోసమే ఒత్తిడి చేయడం కూడా భావ్యం కాదన్నారు. ఇక నుంచి ఆధార్ కార్డు సహా సీనియర్ సిటిజన్ ఐడీ కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, రేషన్ కార్డుల్లో దేన్ని చూపించినా అంగకరించాలని ఈడీ స్పష్టం చేశారు. అది ఏ రాష్ట్రంలో జారీ అయినా సమ్మతించాలన్నారు. స్థానికతతో సంబంధం లేకుండా అన్నిరకాల ఐడీ కార్డులను ఆమో దించాలని కూడా ఆయన స్పష్టం చేశారు. కేవలం 60 ఏళ్లు పైబడి వుండాలన్న నిబంధనను మాత్రం పాటించాలని చెప్పారు. ఐడీ కార్డుల్లో కేవలం కార్డును మాత్రమే తప్పనిసరిగా చూపించాల్సిన అవసరం కూడా లేదని, డిజిటల్ రూపంలో వున్నా అంగీకరించాల్సిందేనని స్పష్టంగా పేర్కొన్నారు.

వయసు నిర్ధారణ కోసం మాత్రమే ఐడీ కార్డును చూపించాలన్న నిబంధనను గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. అవగాహన లేని కారణంగా వయోవృద్ధుల్లో ఆర్టీసీపైన అసహనం పెరుగుతోందని, దీనికి సంబంధించిన ఫిర్యాదులు కూడా ఎక్కువగా వస్తున్నాయని గుర్తు చేశారు. ఇక మీదట అలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఈడీ సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అనితదీప్తి



రైల్వేకోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకురాలు దుద్యాల అనితదీప్తి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమె కడప మెప్మాలో కో-ఆర్డినేటర్‌గా పనిచేసేవారు. 2021లో తన పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. గత ఎన్నికల్లో రైల్వేకోడూరు టికెట్టు కోసం చివరి వరకు పోరాడినా దక్కలేదు. ఆమె సేవలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఈ పదవి ఇచ్చినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

సుండుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగముని నాయక్‌కు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుతున్న చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదు అందడంతో విచారణ చేసి నివేదికను అందజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

సీకేదిన్నె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దివారి అతుల్‌కుమార్ (42) మృతిచెందినట్లు సీకేదిన్నె పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు... చిత్తూరు నుంచి కడపకు బ్యాటరీ లోడుతో వచ్చిన లారీ గురువారం తెల్లవారుజామున గువ్వల చెరువు ఘాట్ దిగుతూ అదుపుతప్పి ఓ వైపునకు పడిపోయింది. దీంతో డ్రైవర్ అతుల్ ఆచూకీ తెలియరాలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం లారీలోని సరుకు తొలగించి లారీని క్రేన్‌తో ఎత్తి చూడగా లారీ కింద ఇరుక్కుపోయిన ఆయన మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె



తహసీల్దారుకు నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

పీలేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీలోపు తమ సమస్యలు పరిష్కరించ కుంటే నిరవధిక సమ్మెలోకి వెళతామని 108 ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని, గత నాలుగేళ్ల కాలంలో తమకు వేతన సవరణ జరగలేదని, ప్రతి ఏడాదీ ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు, అరియర్స్, ఈఎల్ డబ్బులను అరబిందో సంస్థ చెల్లించలేదని తెలిపారు. ఉద్యోగులకు చెందిన పీఎఫ్‌లో యాజమాన్య వాటా కూడా ఉద్యోగుల దగ్గరే వసూలు చేస్తున్నారని వారు వాపోయారు. 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వంలో తమకు ప్రతి నెలా రూ.4 వేలు అదనంగా ఇచ్చేవారని, దానిని గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, దానిని వెంటనే పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం చేస్తున్న 12 గంటల పని విధానాన్ని రద్దు చేసి 8 గంటల పని విధానం అమలు చేయాలని, అంతర జిల్లాల బదిలీలు చేపట్టాలని, ఇది వరకే మరణించిన ఉద్యోగులకు రూ.20 లక్షల బీమా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై తాము ఇది వరకే అటు ప్రభుత్వానికి, ఇటు అరబిందో సంస్థకు విన్నవించుకున్నామని, ఈ నెల 25వ తేదీలోపు పరిష్కారం కాకుండా సమ్మెలోకి దిగడం తప్ప తమకు గత్యంతరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగులు రహంతుల్లా, వెంకటాచలపతి, శ్రీనివాసులు, రవి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తట్టుకోలేక నా కుమార్తె వెళ్లిపోయింది

- పోలీసులకు తండ్రి ఫిర్యాదు

పులివెందులటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తట్టుకోలేక తన కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిందని అర్బన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం జొన్నా లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. పులివెందుల పట్టణం ఆర్టీసీ డ్రైవర్ జయరాం కుమారుడు విష్ణువర్ధన్ 2014లో జొన్నా టెక్స్‌టైల్స్ షోరూం యజమాని కుమార్తె హేమలతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వికలాంగుడిగా పుట్టడంతో భార్యను భర్త విష్ణువర్ధన్ మానసికంగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి హేమలత ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

వీరబల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పనులు చేయకుండానే పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ సానిపాయి పంచాయతీ సర్పంచ్ నేతి ఆంజనేయులుపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఆయన ఆదేశాల మేరకు డీఎల్‌పీవో మస్తాన్‌వలీ శుక్రవారం గ్రామ సచివాలయంలో విచారణ నిర్వహించారు. గ్రావెల్ పనులు చేయకుండానే రూ.20 లక్షల వరకు డ్రా చేసినట్లు ఫిర్యాదుదారులు రాంమోహన్, రమేశ్ ఆరోపించారు. బ్లీచింగ్ చల్లకుండా, నీళ్ల ట్యాంకు శుభ్రం చేయకుండానే నిధులు డ్రా చేవారన్నారు. పనులకు సంబంధించి రికార్డులు చూపించాలని డీఎల్‌పీవోను అడిగారు. సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు కింద ఉంచడంపై అసహనం వ్యక్తం చేశారు. సర్పంచ్ నేతి ఆంజనేయులు మాట్లాడుతూ తాను చేసిన పనులకు రికార్డులున్నాయని, తమపై కక్ష గట్టి ఇలా విచారణలు చేయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో మస్తాన్‌వలి

ఉచితానికి ఈకేవైసీ కష్టాలు



- నమోదు అయితేనే లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు
- గ్రామీణప్రాంతాల్లో అవగాహన లేమి
- పలువురు పేదలకు చేకూరని లబ్ధి

పులివెందుల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉచిత సిలిండరు పథకానికి ఈకేవైసీని ప్రభుత్వం తప్పనిసరి చేయడంతో లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం నుంచి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు పొందాలంటే తమ గ్యాస్ ఏజన్సీల ద్వారా ఆధార్‌తో లింకు చేయించుకోవాలని చెబుతున్నారు. సరైన అవగాహన లేక చాలామంది లబ్ధిదారులు పథకానికి దూరంగా ఉన్నారు. మరోవైపు డెలివరీ బాయ్‌లు సిలిండరు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా ఆ లబ్ధిదారుడు ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పినా పట్టించుకోని పరిస్థితి. ప్రభుత్వం దీపావళి సందర్భంగా గత నెల 29 నుంచి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది.

పులివెందుల డివిజనులో 48229 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో దీపం పథకం కింద 33169, ఉజ్వల్ కింద 15060 గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. 26350 మంది లబ్ధిదారులు మాత్ర మే ఈకేవైసీ చేయించుకున్నారు. 21879 మంది చేయించుకోలేదు. అయితే ప్రభుత్వం ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రారంభించడంతో ఈ వారంలో మరో ఐదువేల మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 16879 మంది స్పందించలేదు. ఈకేవైసీ చేయించుకుంటేనే ఈ ఉచిత సిలిండర్లు వస్తాయి. మరోవైపు గ్యాస్‌కనెక్షన్లు పొందే సమయంలోనే ఆధార్ అనుసంధానం చేయించుకోవాల్సి ఉంది. గతంలో రేషన్‌కార్డు ఉండి ప్రస్తుతం వివిధ కారణాలతో తొలగించిన వారికి కూడా ఈకేవైసీ నమోదు కాలేదు. కొంత మంది గ్యాస్ ఏజన్సీల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకున్నా ఎర్రర్ చూపిస్తున్నాయి. దీంతో వేలాది మంది లబ్ధిదారులు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోని లబ్ధిదారులను గుర్తించి వారి ఇంటివద్దకే చేయించేలా శ్రీకారం చుట్టారు. ఈ విషయంపై ఇప్పటికే తహసీల్దారు మహ్మద్ నజీర్ గ్యాస్‌ఏజన్సీ వారికి దిశానిర్దేశనం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సిలిండర్లను అర్హులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ ఎంతవరకు సాధ్యపడుతుందో చూడాలి. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఏ కుటుంబంలో అయితే రెండు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయో అందులో ఒక కనెక్షన్‌కు మాత్రమే అర్హత ఉంది. ఎవరైనా గ్యాస్ కనెక్షన్ చాలా సంవత్సరాలు వాడకుండా ఉంటారో వారు అనర్హులవుతారు. బుక్ చేసిన మొదటి సిలిండరుకు ఈ పథకం వర్తిస్తుంది. బుక్ చేసుకోగానే అర్హులకు నేరుగా 48 గంటల్లో సబ్సిడీ డబ్బులు పడతాయి.

ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు



గండిలో మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చక్రాయపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మహాపూర్ణాహుతితో శుక్రవారం ఘనంగా ముగిశాయి. సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన వేదపారాయణ పండితులు, ప్రధాన అర్చకులు కేసరి అధ్యక్షతన పవిత్రోత్సవాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, మన్యసూక్త హోమం, ఆంజనేయస్వామి మూల మంత్ర హోమం, సుదర్శనహోమం, పవిత్ర విసర్జన సోమకుంభ ఉద్వాసన, మహాపూర్ణాహుతి, మహాకుంభ ప్రోక్షణ, నివేదన, శాత్తుముర్రై అనంతరం తీర్థ ప్రసాదాలను నొసంగారు. ఉదయం 6 నుంచి 1 గంట వరకు ఉత్సవాలు నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా గండి ఆంజనేయస్వామ దేవస్థానం భక్తులతో కిక్కిరిసిపోయింది. శివాలయం, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా అంజన్నను పూలమాలలతో ముంచెత్తారు. దేవస్థాన ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్లు వెంకటస్వామి, కావలి విజయభాస్కర్, పాలక మండలి సభ్యులు, వేదపారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి వద్ద యువకుడి గల్లంతు





గల్లంతైన యువకుడు గణేష్ (ఫైల్), విషాదంలో బంధువులు

వల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించడానికి పెద్దఎత్తున భక్తులు పుష్పగిరి క్షేత్రానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో నదిలో ఓ బాలుడు ప్రమాదంలో ఉండగా.. కాపాడబోయిన యువకుడు నీటి ఉధృతికి గల్లంతయ్యాయడు. బాలుడు మాత్రం ప్రమాదం నుంచి బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కడప ఎన్జీవో కాలనీకి చెందిన రెడ్డిపల్లె గణేశ్ (27) తన భార్యతో కలిసి పుష్పగిరి క్షేత్రానికి వచ్చాడు. నదిలో బాలుడు కొట్టుకుపోవడం గమనించి కాపాడేందుకు నదిలోకి దిగాడు. నీటి ఉధృతికి గణేష్ కొట్టుకుపోగా చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో అక్కడున్న పోలీసులు, గ్రామస్తులు సహాయక చర్యలు చేపట్టారు. కానీ యువకుడి ఆచూకీ లభించకపోవడంతో ఈ విషయాన్ని సీఐ రోషన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి అక్కడకు వచ్చి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఫైర్ సిబ్బంది, రెస్క్యూటీంను తీసుకువచ్చి గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రాత్రి పొద్దుపోయే వరకు యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కాగా, గల్లంతైన యువకుడు గణేష్ కడపలో పుస్తకాల వ్యాపారం చేసేవాడని, నెలన్నర క్రితం వివాహమైందని బంధువులు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి.. తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సుబ్బలక్ష్మమ్మ

కాశినాయన, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డబ్బులు అడిగితే ఇవ్వలేదనే కోపంతో కట్టుకున్న భార్యపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని బాలరాజుపల్లె గ్రామంలో బసిరెడ్డి రామిరెడ్డి, సుబ్బలక్షుమ్మ దంపతులు నివశిస్తున్నారు. శుక్రవారం రామిరెడ్డి తనకు డబ్బులు ఇవ్వాలని సుబ్బలక్షుమ్మను అడిగాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఖర్చు చేస్తావంటూ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. రామిరెడ్డి ఆవేశంతో సుబ్బలక్షుమ్మను కత్తితో పొడిచాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



గూడూరు ఆశీర్వాదం (ఫైల్)

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన గూడూరు ఆశీర్వాదం (58) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సీ కాలనీలో ఆశీర్వాదం భార్య దేవమ్మలు నివాసముంటున్నారు. వీరికి మూడెకరాల సొంత భూమి ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, శనగ, పత్తి ఇతర పంటలు సాగుచేసేవాడు. పంటలు సక్రమంగా చేతికి రాక అప్పులపాలయ్యాడు. సుమారు రూ.9లక్షల మేర అప్పు ఉన్నట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు ట్రాక్ వద్ద తీవ్ర గాయాలతో యువతి



రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట గ్రామం రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం తీవ్ర గాయాలతో పడి ఉన్న యువతిని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న రైల్వే సిబ్బంది గాయపడిన యువతిని 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన యువతి తిరుపతిలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతోంది. బద్వేల్ నియోజకవర్గం బి.కోడూరు మండలం రాజుపాలెం పంచాయతీ వెంకటశెట్టిపల్లెకు చెందిన బి.రామసుధగా రైల్వే పోలీసులు గుర్తించారు. స్థానిక పోలీసులు కూడా ఆరాతీస్తున్నారు.

నెహ్రూ హయాంలో సహకార రంగానికి పెద్దపీట

- సీటీసీ ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీటీసీ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆధ్వర్యంలోనే సహకార రంగానికి పెద్దపీట వేశారని కో ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటరు ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక డీసీఎంఎ కార్యాలయంలో శుక్రవారం జాతీయ సహకార దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 71వ జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. డీసీఎంఎస్‌లో గత ఏడాది ఎంత ప్రగతి సాధించాం, ఈ ఏడాది ఎంత సాధించాం అనే లోటుపాట్లపై చర్చించుకునేందుకు ఇలాంటి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సహకార రంగంలో ముఖ్యమైన వ్యక్తుల సలహాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ వైఎస్ సత్యానందం మాట్లాడుతూ రైతు ప్రయోజనం కోసం సహకారరంగం ఏర్పడిందన్నారు. సహకార బ్యాంకు ద్వారా రుణం పొందితే భవిష్యత్తులో రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. సీటీసీ ఫణిరాజ్ మాట్లాడుతూ దేశానికి రాజ్యాంగం ఎంత ప్రాముఖ్యమో సహకారరంగంలో సంఘాలకు బైలా అంత ముఖ్యమైందన్నారు. సొసైటీలో ఆర్థికంగా నష్టం వస్తే ఆ సొసైటీ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుభాష్‌చంద్రబోస్, డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ బిజినెస్ మేనేజరు ఖాదర్‌వల్లి మాట్లాడారు. సమావేశానికి ముందుగా సహకార పతకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సహకార సిబ్బంది, డీసీఎంఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛను విధానం అమలు చేయాలి

ఏఐఎస్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న సదానంద గౌడ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఏఐఎస్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్టీయూ భవన్‌లో ఆయన మాట్లాడుతూ లక్షలాది ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలు సీపీఎస్‌తో ఇబ్బంది పడుతున్నాయని.. చాలా రాష్ట్రాలు సీపీఎస్ రద్దు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాయన్నారు. దేశవ్యాప్తంగా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్సన్ అనేది ఉద్యోగి హక్కుగా భావించి పాత పింఛను విధానం వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్టీయూ రాష్ట్రనాయకులు సురేశ్‌బాబు, బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, రాష్ట్ర మున్సిపల్ కన్వీనరు రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తోందని.. పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సహక కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధశాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సహకాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠం చేయాలన్నారు. నూతన ఇండస్ట్రియల్ విధానానికి అనుగుణంగా జిల్లా ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనన్నట్లు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలను ఔత్సాహికపారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో మౌలిక వసతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సహాయ సహకారాలను అందివ్వాలన్నారు. జిల్లాలో గోల్డ్, టెక్స్‌టైల్ క్లస్టర్ల ఏర్పాట్ల అభివృద్ధికి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో పరిశ్రమల జీఎం చాంద్ బాషా, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, లీడ్ బ్యాంకు మేనేజరు జనార్ధన్, డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబరు శ్రీకాంత్ నాయక్, డిక్కీ కో-ఆర్డినేటర్ శివవంకర్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఇసుక సరఫరా : జేసీ



దర్జీపల్లె ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు అనుగుణంగా ఇసుక సరఫరా చేపట్టాలని జేసీ అదితిసింగ్ అన్నారు. శుక్రవారం దర్జీపల్లెలోని ఇసుక క్వారీని అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఉచితంగా ఇసుక పంపిణీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని.. ఎలాంటి అవకతవకలు లేకుండా ఇసుకను సరఫరా చేయాలన్నారు. ఇసుక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నదిలోకి వెళ్లే వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని, డంపింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్టాక్‌పాయింట్‌ను పరిశీలించి రోజువారీగా ఎన్ని టిప్పులు ఇసుక వెళుతుంది.. సామాన్య ప్రజలు ఎంతమంది వస్తున్నారనే దానిపై పరిశీలించారు. సచివాలయంలో సౌలభ్యంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఇసుకను తరలించాలని సూచించారు. గ్రామంలో పెద్దఎత్తున టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తే రోడ్లు దెబ్బతింటాయని స్థానికులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు ఇసుక తరలింపులో అక్రమాలకు చోటు లేకుండా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు వెంకటరమణమ్మ, భూగర్భగనుల శాఖ సంచాలకులు సూర్యకుమార్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వో అంజి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్‌ప్లాంటు నిర్మాణానికి స్థల పరిశీలన



బి.మఠం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్‌ప్లాంటు నిర్మాణానికి సంబంధించి శుక్రవారం బ్రహ్మంసాగర్ సరిహద్దు ప్రాంతంలోని స్థలాన్ని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీ ప్రజల కరెంటు కష్టాలు తీర్చేందుకు సోలార్ పవర్‌ప్లాంటు నిర్మాణం కోసం బ్రహ్మంగారిమఠంలో 8ఎకరాలు భూమిని కేటాయించేందుకు స్థలాన్ని పరిశీలించామన్నారు. స్థానిక ఐదురోడ్ల కూడలిలో ఐదేళ్లగా కోర్టులో పెండింగులో ఉన్న సర్వే నెం.444 స్థలాన్ని పరిశీలించామన్నారు. అనంతరం ఆయన వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. మండల తహసీల్దారు దామోదర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొరవడిన నిఘా



- విజలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఒక కానిస్టేబుల్‌తోనే విధులు
- అధికారులు అంతంత మాత్రమే

కడప క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. అధికారులు కూడా అంతంత మాత్రంగా ఉన్నారు. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై నిఘా కొరవడింది. అలాగే హోటల్స్‌లో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా. ట్రాన్స్‌పోర్టులలో బిల్లులు, రేషన్ బియ్యం , ఇసుక అక్రమ రవాణాతో పాటు నిల్వ పాయింట్లు, మైనింగ్, ఎరువుల విక్రయాలు, గ్రావెల్స్ తవ్వకాలు తదితర అంశాలపై విజిలెన్స్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపడతారు. లోపాలున్న వారిపై కేసులు కూడా నమోదు కూడా చేస్తారు. అయితే గత కొన్ని నెలలుగా ఈ శాఖలో సిబ్బంది కొరత కారణంగా విజిలెన్స్ దాడులు జరగడం లేదు. దీంతో ఇష్టానుసారం అవినీతి, అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ప్రాంతీయ కార్యాలయానికి సంబంధించి అదనపు ఎస్పీ, డీఎస్పీ ఉంటారు. అయితే అదనపు ఎస్పీ మాత్రమే ఉన్నారు. డీఎస్పీ అధికారి ప్రస్తుతం లేడు. అలాగే ముగ్గురు సీఐలు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. ఎస్ఐలు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. అలాగే ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్ ఉండగా ప్రస్తుతం ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఎంపీడీవో ఒకరు ఉండగా ఆ స్థానం కూడా ఖాళీగానే ఉంది. ముగ్గురు డీఈలు ఉండాల్సి ఉంటే ఇరువురు మాత్రమే ఉన్నారు. ఇక తహసీల్దారు అయితే ఒకరు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం లేరు. ఈ స్థానం గత నాలుగేళ్ల నుంచి ఖాళీగానే ఉన్నట్లు తెలుస్తుంది. అసిస్టెంట్ జియాలజిస్ట్ ఒకరు ఉండాల్సింది.. అయితే ఇక్కడ ఎవరూ లేరు. ఇక జూనియర్ అసిస్టెంట్లు కూడా ఇక్కడ లేకపోవడంతో ఉన్న సిబ్బందికి పని భారంగా మారుతోంది. ఏదిఏమైనా ప్రభుత్వం సంక్షేమాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఈ శాఖ తనిఖీలు చేపట్టాల్సి ఉంది. అయితే ప్రస్తుతం సిబ్బంది కొరతతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేస్తే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు తనిఖీలు ముమ్మరంగా సాగుతాయని పలువురు చెప్పుకొస్తున్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం


కలికిరి సోమేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు


తంబళ్లపల్లె మల్లయ్యకొండ గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


వాల్మీకిపురంలో అలంకరణలో కామేశ్వరస్వామి


మదనపల్లెలో వరాల ఆంజనేయస్వామి

మదనపల్లె అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాల్లో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. దీంతో ఆలయాలకు కార్తీక దీప శోభ సంతరించుకుంది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మదనపల్లె పట్టణం దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మహిళలు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. దీంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. చిప్పిలిగ్రామం చిట్టిఅన్నవరంలో సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులు సత్యనారాయణ వ్రతం ఆచరించారు. సాయంత్రం మహిళలు కలిసి లక్షదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. మంజునాధ స్వామిఆలయంలో మహిళలు అధికంగా పాల్గొని కార్తీక దీపోత్సవం నిర్వహించారు. కనకదాస్ నగర్ శివాలయంలో, అనపగుట్టలోని శ్రీకృష్ణ ఆల యంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

యోగబోగేశ్వరుడికి అన్నాభిషేకం

మదనపల్లె మండలం,చిప్పిలిగ్రామం, మడికయ్యల శివాలయంలోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఈవో రమణ, ఆలయప్రధాన అర్చకుడు విశ్వేశ్వర ప్రసాద్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం యోగభోగేశ్వరిడికి అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలు ఆలయంలో దీపారాధన చేశారు. మదనపల్లెకు చెందిన టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త మార్పూరి సుధాకర్‌నాయుడు అన్నాభిషేకంలో పాల్గొన్నారు.

నేలమల్లేశ్వర ఆలయంలో లక్ష దీపోత్సవం

నిమ్మనపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం అటవీ ప్రాతంలో వెలసిన నేల మల్లేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వైభవంగా లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వాహకులు చెక్కభజనలు, పిల్లనగ్రోవి వంటివి ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మదనపల్లి డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐ రమేష్, ఎస్‌ఐ తిప్పేస్వామిలు పర్యవేక్షించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం ఆలయంలో పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేశారు. అనంతరం అభయాంజనేయస్వామికి విశేష పూజలు జరిగాయి. మండలంలోని గండబోయనపల్లె సత్యమ్మతల్లి అమ్మవారి ఆలయం కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై దీపాలను వెలిగించి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కలికిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలికిరి పట్టణంలోని పురాతన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి దీపారాధన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల తాకిడితో ఆలయం కిక్కిరిసింది. (మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో అఖండ దీపారాధన కోసం క్యూ కట్టారు. వేల సంఖ్యలో దీపాలు వెలిగించడంతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలుగులతో నిండింది. అనంతరం కార్తీక పౌర్ణమి చివరి ఘట్టంగా ఆలయంలో జ్వాలా తోరణం అత్యంత వైభవంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం

పీలేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పీలేరు మండలంలోని ఆలయాల్లో కార్తీక దీపోత్సవంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివెరిసింది. శుక్ర వారం వేకువజాము నుంచి రాత్రి వరకు భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయాలన్నీ కిటకి టలాడాయి. పీలేరు పట్టణంలోని కాశీవిశ్వేశ్వర స్వామి, రౌద్రాల అంకాళమ్మ, చెన్నకేశవ స్వామి, పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి, జంగం పల్లెలోని వీరభద్ర స్వామి ఆలయం, శివరామా పురంలోని భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి ఆలయం, అగ్రహారం అష్టలక్ష్మీ సమేత నరసిం హస్వామి ఆలయం, అడవిపల్లె వద్దనున్న మద్దుండాల మల్లేశ్వర స్వామి ఆలయాల్లో మహిళలు పెద్దఎ త్తున కార్తీక దీపాలు వెలిగించారు.

పెద్దతిప్పసముద్రంలో : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులకు సత్యనారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహించారు. ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించడంతో ఆలయంలో కార్తీక శోభ సంతరించుకుంది.

వైభవంగా మల్లయ్యకొండ గిరిప్రదక్షిణ

తంబళ్లపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు గిరిప్రదక్షిణను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో మల్లికార్జున స్వామిని కొలువుదీర్చి మల్లయ్యకొండ నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభించి కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలతో తంబళ్లపల్లె, కొటాల, బండ్రేవు, కలిచెర్ల, శివపురం, సిద్దవరం, కోటకొండ, దండువారిపల్లె మీదుగా తిరిగి మల్లయ్యకొండకు చేరుకున్నారు.

కలకడ,లో: కార్తీక పౌర్ణమి సందర్భంగా కలకడలోని సిద్దేశ్వరస్వామి ఆలయం, బాటవారిపల్లెలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంతోపాటు పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే ఝురి కోనలో లక్ష దీపోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం, కల్యాణోత్సవం, సైకత లింగ పూజ, బిల్వార్చన, లక్ష దీపోత్సవం నిర్వహిచారు. ఝురి,సిద్దేశ్వర ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

భార్యను హింసించిన భర్తపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): భార్యను హింసించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని బసినికొండ పంచాయతీ శివాలయం వీధికి చెందిన షేక్ నదియా(23) తన భర్త షేక్ గౌస్ బాషా రెండేళ్లుగా తనను హింసిస్తూ, పరాయి స్త్రీ మోజులో పడి పట్టించుకోవడంలేదని తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గౌస్‌బాషా పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వన్ టౌన్ సీఐగా ఎరిషావలి

మదనపల్లె అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్‌టౌన్ సీఐగా ఎరిషావలి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేస్తున్న సీఐ చాంద్‌బాషాను బదిలీపై అన్నమయ్యజిల్లా రాయచోటి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్లారు. డీఐజీ కోయప్రవీణ్‌కుమార్ ఇటీవల సీఐ బదిలీల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

పీలేరు క్యాడెట్‌కు జేయూవీ హోదా

పీలేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్‌గా సేవలందిస్తున్న వి.బాలాజీకి జూనియర్ అండర్ ఆఫీసర్(జేయూవీ) దక్కింది. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ సుబేదార్ మేజర్ రెడ్డి, లెఫ్టినెంట్ వెంకటరమణయ్య అతనిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.సుధాకర్‌రెడ్డి బాలాజీని ఆదర్శంగా తీసుకుని ఇతర క్యాడెట్లు కూడా కృషి చేయాలన్నారు.

బాల్యవివాహాల నిరోధానికి కొత్త చట్టం తేవాలి



డిప్యూటీ సీఎంకు పోస్టుకార్డులో ప్రతిపాదనలు రాసి చూపిస్తున్న విద్యార్థినులు

మదనపల్లె టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాల్యవివాహాలను అడ్డుకోవడానికి ప్రభుత్వం నూతన విధానం అమల్లోకి తేవాలని పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్ఆర్ కాలని, కుమారపురం, జూనియర్ బాలికల కళాశాలలో బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లలితమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాలను అడ్డుకునేందుకు ప్రతిపాదనలను పోస్టుకార్డుల్లో రాసి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు పంపుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివపార్వతి, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరి, వేరుశనగ పంటలకు బీమా చేసుకోండి

కురబలకోట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, టమోటా, వేరుశనగ పంటలకు రైతులు బీమా చేసుకోవాలని ఏవో భారతి పేర్కొన్నారు. వ్యవసాయ బోర్ల కింద సాగు చేసిన పంటలైన టమోటా పంటకు రూ.1600, వేరుశనగ పంటకు రూ.96, వరి పంటకు రూ.123 చొప్పున చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. బీమా చేసుకోవడానికి డిసెంబరు 15న లోగా బీమా చేసుకోవాలన్నారు. రైతులకు 30 కిలోల వేరుశనగ బస్తాను రూ.1730లకు రాయితీతో ఇస్తామన్నారు.

త్రోబాల్ జాతీయ జట్టుకు మదనపల్లె విద్యార్థి


బహుమతి సాధించిన జట్టులోని ఇద్దరు క్రీడాకారులతో జ్ఞానాంబిక యాజమాన్యం

మదనపల్లె టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో శ్రీలంక జట్టుతో నిర్వహించే త్రోబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఇండియా జట్టులో మదనపల్లె విద్యార్థి ఎంపికయ్యాడని జ్ఞానాంబిక కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని బిజనూర్‌లో విక్రమ్ యూనివర్సిటీలో 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున తమ కళాశాలకు చెందిన పురుషోత్తం, హరీష్‌లు పాల్గొడమే కాక, తెలంగాణతో జరిగిన పోటీలో ఏపీ జట్టు గెలవడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టు తృతీయ బహుమతి దక్కేలా చేశారన్నారు. అంతే కాకుండా పురుషోత్తం ఉత్తమ ప్రతిభ కనపరచి త్రోబాల్ జాతీయజట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 27వ తేదీన చెన్నైలో నిర్వహించే అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో శ్రీలంక జట్టుతో ఆడే ఇండియా జట్టుకు పురుషోత్తం ప్రాతినిధ్యం వహిస్తున్నాడన్నారు. వారిని ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, పీడీలు శరత్‌నాయక్, జగదీష్ అభినందించారు.

అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలి

మదనపల్లె టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో ఏయే గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గుర్తించి ఆ పనులను ఆయా మండల స్థాయి అధికారులకు తెలియజేయాలన్నారు. అధికారులు గుర్తించిన అభివృద్ధి పనులను ఆయా గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా ఆన్‌లైన్‌లో ఎక్కించాలన్నారు. అప్పుడే కేంద్ర ప్రభుత్వం నుంచి టీఎఫ్‌సీ నిధులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ డిష్ రమణ, కార్యదర్శి షఫుద్దీన్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లపై వేధింపులకు పాల్పడడం తగదు



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసనలో సీఐటీయూ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు

మదనపల్లె అర్బన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లపై వేధింపులకు పాల్పడడం తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌర వాధ్యక్షుడు శ్రీనివాసులు, కోశాధికారి హరిశర్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మలు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్న సీటీఎం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీలక్ష్మీ, సీహెచ్‌వో అరుణ, సూపర్‌వైజర్ సుమతిలపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ డీఎం హెచో రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రామామణి, మల్లేశ్వరి, నాగరత్న, శ్రావణి, పద్మావతి, లలిత, పుణ్యవతి, గాయత్రి, ప్రసన్న, రమాదేవి, అమరావతి, పార్వతీ, బాలకుమారి, జానకీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డిఫెన్స్ అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌కుమార్

కురబలకోట, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి):విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని డిఫెన్స్ అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల్లో విద్యార్థులకు బ్యాంకింగ్ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమి షన్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మన దేశంలో సివిల్ సర్వీస్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉందని విద్యార్థులు దీనిపై దృష్టి సాధించి విజయాలను సాధించాలన్నారు.

అభ్యంతరాలు ఏడు రోజుల్లో తెలియచేయాలి

తంబళ్లపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లె పంచాయతీ మిట్టమాలపల్లెలో వెలసిన రామాలయాన్ని దేవదాయశాఖలో రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఏమైనా అభ్యంతరాలు కానీ సలహాలు, సూచనలు ఉంటే ఏడు రోజుల్లోపు రాయచోటి జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో ప్రజలు తెలియచేయాలని ఆయన కోరారు.

తంబళ్లపల్లెలో వర్షానికి నేలకొరిగిన వరి



తంబళ్లపల్లె, నవంబరు15(ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో అల్పపీడన ప్రభావం కారణంగా కురు స్తున్న వర్షాలు పంటలను నిలువునా ముంచేస్తు న్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడి రాక అప్పులు పెరిగి తీవ్రంగా నష్టపోతున్నామని రైత న్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తంబళ్లపల్లె మండ లంలో గురువారం కురిసిన వర్షాలకు పలు చోట్ల వరి పంట నేల వాలింది. మండలంలో ఖరీ ఫ్ సీజన్‌లో సుమారు 590 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో ముందుగా సాగు చేసిన కొంద రు రైతులు సుమారు 300 ఎకరాలకు పైగా పం టను కోత కోసి ఇంటికి చేర్చుకోగా..మిగిలిన పంట కోత దశలో ఉంది. ఇలాంటి తరుణంలో కురుస్తున్న వర్షాలతో వరి రైతుకు నష్టం కలుగుతోంది. మండలంలోని గోపిదిన్నె, కొటాల తదితర గ్రామా ల్లో పలువురు రైతులు సాగు చేసిన వరి పంట నేల వాలింది. గోపిదిన్నె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితర రైతులు సాగు చేసిన వరి పంట కోత దశలో ఉండగా గురువారం కురిసిన వర్షానికి నేలవాలింది. దీంతో చేతికొచ్చిన పంట నేలపాలయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వరిలో నీళ్లు నిల్వ లేకుండా చేసుకోవాలి

వర్షాల కారణంగా కోత దశలో ఉన్న వరి మడు లలో నీళ్లు నిలిస్తే పూర్తిగా తీసివేయాలి. మండ లంలో 80 శాతానికి పైగా వరి కోతలు పూర్త య్యాయి. వర్షాలకు వరి పంటలో నీరు నిల్వ ఉండి పైరు నీటిలో తడిస్తేనే ధాన్యం మొలకొచ్చి పాడవుతుంది. పొలంలో నీళ్లు లేకుండా కొతకు వచ్చిన వరి పైరు నేలవాలితే పంటకు ఎటువం టి నష్టం ఉండదు. అటువంటి పంటను కొద్దిగా ఎండకు ఆరిన తర్వాత కోసుకోవచ్చు.

-రమణకుమార్, ఏవో, తంబళ్లపల్లె

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సం ద ర్భంగా స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవా రం ఆలయ అర్చ కుడు విశేష పూజ లు నిర్వహించారు, కార్తీక పౌర్ణమి శుక్కవారం కావడంతో మహి ళలు, భక్తులు అధిక సంఖ్యలో ఆల యం చేరుకుని గంగమ్మను దర్శించు కుని చీర, జాకెట్లు, పసుపు, కుంకు మలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆల యకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు వేణుగోపా ల నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో డీఎస్సీ స్టడీ మెటీరియల్

పీలేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పీలేరు గ్రంథాలయంలో డీఎస్సీ స్టడీ మెటీరియల్ సిద్ధంగా ఉందని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీలేరు గ్రంథాలయాధికారి అమరనాథ్ తెలిపారు. కేవలం డీఎస్సీ మాత్రమే కాకుండా జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో జరిగే వివిధ పోటీ పరీక్షలకు అవ సరమైన పుస్తకాలన్నీ తమ వద్ద ఉన్నాయన్నారు. శుక్రవారం పుస్తక ప్రదర్శనను విద్యార్థులు సందర్శించారు.

వృత్తిదారులకు 5 శాతం బడ్జెట్ కేటాయించాలి


సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న సంఘం నేతలు

పీలేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వృత్తిదారులకు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో 5 శాతం కేటాయించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. పీలేరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను జీవాల పెంపకందారుల పిల్లలతో భర్తీ చేయాలన్నారు. జీవాల పెంపకందారుల వద్ద సెజ్ వసూళ్లను ఫారెస్టు అధికారులు నిలిపివేయాలన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ, డీకేటీ, బంజరు భూములను పశువుల ఆహారం కోసం కేటాయించాలన్నారు. తమ సమస్యల సాధన కోసం త్వరలోనే రాష్ట్ర వ్యాప్త కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ బాబు, కలకడ మాజీ ఎంపీపీ కాంతారావు, పీలేరు కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీకాంత్, సంఘ సభ్యులు మునిరత్న, రమేశ్, రఘునాథ్, వెంకటరమణ, సుగుణ, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు లోపు పక్కాగృహాలు పూర్తి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ వెంకటదాసు

పెద్దమండ్యం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) పక్కాగృహాల నిర్మాణాలు డిసెంబరు లోపు పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ వెంకటదాసు, డీఈ వెంకటరెడ్డి పేర్కొన్నారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పక్కాగృహాల నిర్మాణాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరు అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయించాలన్నారు. దశల వారీగా పూర్తైన నిర్మాణాల పనులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు చేస్తామన్నారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, మండల హౌసింగ్ ఏఈ అక్రం, ఏపీవో మురళి, ఏపీఎం నరసింహులు మండల ఇంజనీర్ అసిస్టెంట్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కురిజల చెన్నకేశవస్వామి భూముల లీజు వేలం


ఆలయ భూముల లీజు వేలం నిర్వహిస్తున్న దేవదాయ అధికారులు

రామసముద్రం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిజల గ్రామంలో వెలసిన పురాతన చెన్నకేశవ స్వామి ఆలయ భూముల లీజుకు సంబంధించి దేవదాయ శాఖాధికారులు శుక్రవారం వేలం నిర్వహించారు. ఆలయానికి చెందిన 2.18ఎకరాల భూములకు మూడు సంవత్సరాల కాలానికి లీజుకు వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన రెడ్డెప్ప సంవత్సరానికి రూ.21వేలు చొప్పున 3ఏళ్లకు రూ.63వేలు వేలంలో దక్కించుకున్నారు. కాగా ఇదే భూములను గత 30ఏళ్లుగా ఇతరుల దురాక్రమణకు గురి కాగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చొరవతో దేవదాయ అధికారులు ఈ భూములను గత వారం క్రితం స్వాధీనం చేసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మాజీ జడ్పీటీసీ శివశంకర్, కృష్ణంరాజు, రాజేష్‌స్వామి, ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బంది, ఆలయ అర్చకులు కులశేఖర్‌స్వామి, దేవదాయ శాఖ అధికారులు రమణారెడ్డి, శశికుమార్, రెవెన్యూ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో ఈ వేలం పాట నిర్వహించారు.

లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం కావాలి


వాల్మీకిపురం కోర్టులో పోలీసులతో మాట్లాడుతున్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబరు 14న జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని స్థానిక జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గురు అరవింద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోర్టులో పోలీసు అధికారులు, బ్యాంకర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో సివిల్ క్రిమినల్, బ్యాంకుల రుణాలు, తదితర రాజీ కాదగ్గ కేసులన్నీ కూడా పరిష్కారం అయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పోలీసు అధికారులు ముఖ్యంగా ప్రజలకు అవగాహన కల్పించి కేసులు పరిష్కరించుకునేలా కృషి చేయాలన్నారు. దీర్ఘకాలంగా కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేసుకుంటున్న కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా కేసులను రాజీ చేసుకునేందుకు చక్కటి వేదిక జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమమన్నారు. ఈకార్యక్రమంలో వివిధ మండలాల పోలీసు అధికారులు, బ్యాంకుల మేనేజర్లు, మండల న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా సోమశేఖర్ రెడ్డి

కలికిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్తగా బి.సోమశేఖర్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళా రెడ్డి శుక్రవారం నియామక ఉత్తర్వులిచ్చారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో సోమశేఖర్ రెడ్డి పీలేరు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తనకు ఇన్‌చార్జీ పదవి అప్పగించిన షర్మిళా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజలు


సమావేశంలో మాట్లాడుతున్న అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చిప్పిలిగ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం నుంచి మండల పూజలు నిర్వహిస్తునట్లు ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ధ్వజారోహణ, నిత్యపూజలు, భక్తులకు అన్నదాన కార్యక్ర మాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. అయ్యప్ప మాలదారులకు ఆలయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆలయంలో నిర్వహించే అన్నదానానికి దాతలు పూర్తి సహకారం అందివ్వాలని కోరారు. ఆలయంలో నేటి నుంచి 2025 జనవరి 15 వరకు ప్రతిరోజు పూజలు, అభిషేకాలు, భజనలు జరుగుతాయన్నారు. డిసెంబరు 4న ఆలయంలో వైభవంగా పడిపూజ జరుగుతుందన్నారు. భక్తులు పూజా కార్యక్రమాలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ: మదనపల్లెలో అయ్యప్ప స్వామి ఆంబళం పడిపూజ గురుస్వాములు శ్రీకాంత్, బాబుస్వామి, మరళీ, కరాటే రమణ, కృష్ణప్ప, శ్రీరాములు, మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో స్వాములు పాల్గొని అయ్యప్ప భజనలతో ఆ ప్రాంతం మారుమోగింది. అనంతరం భక్తులకు అన్నదానం వితరణ చేశారు.

వృద్ధాశ్రమానికి దుప్పట్లు వితరణ



పీలేరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పీలేరు-సదుం మార్గంలో ఉన్న శ్రీలక్ష్మీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పీలేరు మానవత సంస్థ సభ్యులు దుప్పట్లు శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ వి.రామచంద్ర, అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సురేశ్ కుమార్, సభ్యులు జగన్మోహన్, వైవీ రమణ, రాచపల్లె కృష్ణమూర్తి, పోతంశెట్టి రమేశ్, పోతంశెట్టి సుధాకర్ బాబు, యర్రంశెట్టి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పీటీఎం మండల పరిషత్ ఏవోగా జ్యోతిలత

పెద్దతిప్పసముద్రం నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏవో) గా జ్యోతిలత శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం అజాద్ తెలిపారు. ఆమె తిరుపతి రూరల్ మండలం పైడిపల్లె గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శిగా పని చేస్తూ పదోన్నతి మీద పెద్దతిప్పసముద్రం మండలానికి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.